శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



గాజాలో 45 మంది సజీవ దహనం
జూలై 4న బ్రిటన్ ఎన్నికలు.. టోరీలకు శృంగభంగం తప్పదా! లోపలి పేజీల్లో..



సంపుటి 26, సంచిక: 338 | మంగళవారం | 28-05-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


దక్షిణాదిలో 'ఇండియా'కు

## వందకుపైగా సీట్లు



కేరళ సదస్సులో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

దక్షిణాదిలో ఇండియా కూటమికి వందకు పైగా సీట్లు రావడం ఖాయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతంలో దాదాపు అన్ని స్థానాలు గెలిచిన గుజరాత్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్‌లో ఈసారి బిజెపికి సగానికి సగం సీట్లు తగ్గుతాయని తెలిపారు. ఇలాగైతే 400లకు పైగా సీట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఈసారి దేశాన్ని, రాజ్యాంగాన్ని తరువాయి 2లో

## 1న ఇండియా కూటమి భేటీ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి చెందిన అగ్రనాయకులు జూన్ 1వ తేదీన భేటీ అయ్యే అవకాశాలున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో తమ పనితీరును అంచనా వేయనున్నారు. ఫలితాలు వెలువడడానికి ముందు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 1వ తేదీన ఆఖరు విడత పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో తరువాయి 2లో

# 'రెమల్' తుఫాన్ విధ్వంసం

పశ్చిమ బెంగాల్‌లో ఆరుగురు మృతి

- రెండు లక్షలమంది తరలింపు
- 2,500 ఇళ్ళు ధ్వంసం : 27 వేల ఇళ్ళకు పాక్షికంగా నష్టం
- ఇళ్ళు, పంటలకు నష్ట పరిహారం: మమతాబెనర్జీ





**కోల్‌కతా :** 'రెమల్' తుఫాన్ పశ్చిమ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించింది. కోస్తా ప్రాంతాల్లో ఈ తుఫాను కారణంగా ఆరుగురు మరణించారు. అనేమంది ఈదురుగాలుల్లో గాయపడ్డారు. వేలసంఖ్యలో ఇళ్ళు పూర్తిగా, పాక్షికంగా కూలిపోయాయి. భారీ వర్షాలు బెంగాల్‌లో ఇంకా కొనసాగుతున్నాయి. అదే విధంగా ఆ సమీపంలోని బంగ్లాదేశ్‌కు కూడా ఈ తుఫాన్ అనూహ్యమైన నష్టం తెచ్చిపెట్టింది. బంగ్లాదేశ్ నైరుతీ మోంగ్లా సమీపం ఖెపుపరా–సాగర్ ఐలాండ్ మధ్య ఉన్న తీర ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలకు ఈ తుఫాన్ తీవ్ర నష్టం కలిగింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తుఫాన్ కారణంగా అనేకమంది ఇళ్ళు పోగొట్టుకున్నారు. రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న రెండు లక్షలమంది ప్రజలను ప్రభుత్వ అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలలో ఉన్న సహాయ శిబిరాలకు తరలించారు. వారికోసం 1,400 సహాయ శిబిరాలు ఏర్పాలు చేశారు. తుఫాన్ అనంతరం ప్రభుత్వ యంత్రాంగం, అత్యవసర సేవల విభాగం సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. వీధుల్లో అడ్డంగా పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, చెత్త చెదారం తొలగిస్తున్నారు. ఐతే ఎడతెగకుండా కురుస్తున్న భారీ వర్షాలు ఈ సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నాయి. కోల్‌కతా, ఉత్తర దక్షిణ 24 పరగణాల జిల్లాలు, హౌరా, హుగ్లీజిల్లాలో మొత్తం 14 జాతీయ విధ్వంస ప్రతిస్పందన బృందాలు పనిచేస్తున్నాయి. దక్షిణ బెంగాల్ బాధితులకు ఆహారం సమకూర్చడం, త్రాగునీరు సరఫరా, వైద్య సహాయం సకాలంలో అందించేలా కార్యక్రమాలను వేగిరపరచింది. తుఫాన్ కారణంగా 27,000 ఇళ్ళు పాక్షికంగా ధ్వంసం కాగా, 2,500 ఇళ్ళు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 1,700 విద్యుత్ తరువాయి 2లో

## ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు

**న్యూఢిల్లీ :** వర్షాధారిత వ్యవసాయంపై ఆధారపడిన దేశంలోని అత్యధిక రాష్ట్రాలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. ఈ ఏడాది సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిసింది. మనదేశంలో వర్షాధారిత వ్యవసాయ పంటలకు నైరుతీ రుతుపవనాలే కీలక ఆధారం. నైరుతీ రుతుపవనాల కోసం రైతులు, కేంద్ర ప్రభుత్వం కూడా చాలా ఆత్రుతగా ఎదురుచూస్తూ ఉంటాయి. జూన్, జులై నెలలు వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలకు కీలకమైన సమయం. ఆర్థిక వ్యవస్థకు అతిముఖ్యమైన ఖరీఫ్ పంటల నాట్లు ఎక్కువగా ఈనెలల్లోనే జరుగుతాయి. నైరుతీ రుతుపవనాల ప్రభావి త రాష్ట్రాలలో ఈ సారి సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. కాగా తరువాయి 2లో

# మళ్ళీ మోదీ రావడం కష్టమే..

**జూన్ 4 తరువాత మోదీనీ ఇడి ప్రశ్నిస్తుంది**

- ప్రతి మహిళ ఖాతాలో రూ. 8,500
- 'అగ్నివీర్' పథకం రద్దు
- రాహుల్‌గాంధీ హామీ

భక్తియార్‌పూర్ / పలిగంజ్



సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓడిపోవడం ఖాయమని, మోదీ మరోసారి ప్రధాని కావడం కష్టమేనని కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే రక్షణ సర్వీసుల్లో నియామకాల పథకమైన 'అగ్నివీర్'ను బుట్టదాఖలు చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. ప్రతినెల ప్రతి మహిళ ఖాతాలో రూ. 8,500 డిపాజిట్ చేస్తామని హామీనిచ్చారు. బీహార్‌లో మహాగట్‌బంధన్ అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ఎన్నికల ర్యాలీల్లో రాహుల్ పాల్గొని మాట్లాడారు. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కాబోరని రాహుల్ జోస్యం చెప్పారు. దేశంలో 'ఇండియా' కూటమి వైపు అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే 'అగ్నివీర్' పథకాన్ని రద్దు చేస్తామన్నారు. మోదీజీ సైనికులను కార్మికులుగా మార్చారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం సైనికులను రెండు కేటగిరిలు 'అగ్నివీర్', ఇతరులుగా విభజించిందన్నారు. అగ్నివీరులు గాయపడినా, అమరులైనా వారికి అమర వీర హోదా గానీ, పరిహారంగానీ రాదన్నారు. ఎందుకు ఈ వివక్ష అని నిలదీశారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత జులై నుంజి ప్రతిపక్ష మహిళ ఖాతాలో రూ. 8,500 జమ చేస్తామని చెప్పారు. ఈ చర్య ప్రతిపక్ష కుటుంబంలో ఆర్థిక పరిస్థితిని మార్చేస్తుందన్నారు. తనను భగవంతుకు పంపంచారు అని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందించారు. జూన్ 4న తరువాత మోదీ చేసిన అవినీతిపై ఇడి ప్రశ్నిస్తుందన్నారు. అయితే మోదీజీ మాత్రం తనకు ఏమీ తెలియదని సమాధానమిస్తారని, తనను భగవంతుడు పంపించారని చెబుతారని ఎద్దేవా చేశారు. మోదీజీ 22 మంది బిలియనీర్లను సృష్టించారని, కానీ ఇండియా కూటమి ప్రభుత్వం కోట్లాదిమంది మిలియనీర్లను తయారు చేస్తుందన్నారు. తన బిలియనీర్ల మిత్రులకు రూ. 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ దేశం ఆయనను ఎప్పటికీ క్షమించబోదని చెప్పారు. పేదల నుంచి నగదును దోచుకుంటున్నారని, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్న కోటీశ్వరులకు ధారా దత్తం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు దేశాన్ని, రాజ్యాంగాన్ని, పేదలకు రిజర్వేషన్లు కాపాడేవని తరువాయి 2లో

# పట్టభద్రుల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో..

- చెదురుమదురు ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతం
- జూన్ 5న ఓట్ల లెక్కింపు





ప్రజాపక్షం/హైదరాబాద్

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం శాసనమండలి నియోజకవర్గ పట్టభద్రుల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. శాసనసభ ఎన్నికల్లో జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక జరిగింది. కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, బిజెపి నేత ప్రేమేందర్ ఎన్నికల బరిలో నిలవగా, వీరితోపాటు మరో 49 మంది పోటీలో నిలిచారు. మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 4,63,839 కాగా వీరిలో పురుషులు 2,88,189 మంది, స్త్రీలు 1,75,645 మంది, ట్రాన్స్ జెండర్లు మరో 5 మంది ఉన్నారు. వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్ధిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో, 605 పోలింగ్ కేంద్రాల్లో ఉపఎన్నిక జరిగింది. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 118, అతితక్కువగా సిద్ధిపేటలో 5 కేంద్రాల్లో పోలింగ్ సాగింది.

**ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు**

ప్రాధాన్యతా ఓటు పద్ధతి అయినందున బ్యాలెట్ విధానంలో ఉపఎన్నిక పోలింగ్ నిర్వహించారు. గతంలో చెల్లని ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు ముందుగానే వివరించి, అవగాహన కల్పించారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎం సిపిఆర్‌ఓ బోరెడ్డి అయోధ్య రెడ్డి తన గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలో ఓటేయగా, తరువాయి 2లో

## ఓటు వేసిన కూనంనేని



ప్రజాపక్షం / లక్ష్మీ దేవిపల్లి

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుదల నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం బాబు క్యాంపు 271 బూత్‌లో కూనంనేని ఓటు వేశారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా పట్టణంలోని సింగరేణి మహిళా కళాశాల 277 బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో తరువాయి 2లో




## నిపుణుల బృందం మేడిగడ్డ సందర్శన

ప్రజాపక్షం / మహాదేవపూర్

జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని అధికారుల బృందం పరిశీలించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు సోమవారం ఈ ఎన్‌సీ అనీల్ కుమార్ నేతృత్వంలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ కు చెందిన ఆరుగురు సభ్యుల బృందం సందర్శించింది ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అంచనా వేసింది కుంగిన వంతెన ఏడవ బ్లాక్‌లో దెబ్బతిన్న పిల్లర్లు, గేట్ల కటింగ్, షీట్‌ఫైల్స్‌గ్రౌటింగ్ పనులను పరిశీలించింది. పిల్లర్ల కుంగుబాటుకు గల కారణాలను అడిగి తెలుసుకుని వాటి ఫుటేజ్ లను సేకరించారు. ఇటీవల ఏర్పడిన బోరియ ప్రాంతాన్ని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ ఎగువ దిగువ భాగాలను పరిశీలించి బ్యారేజీ 15 నుండి 21 పిల్లర్ల గేట్ల వద్ద ఇసుక మేటలను అధికారులు తొలగించే పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో గేట్ల రిపేర్ పనులను దగ్గరుండి పరిశీలించారు. 20, 21 పియర్ల మధ్యలోయంత్రాల ద్వారా గ్రౌటింగ్ పనులు జరుగుతున్నాయి. బ్యారేజీ దిగువ భాగానా నీటి ప్రవాహం తట్టుకునే విధంగా జరుగులున్న సిసి బ్లాక్ పనులు నిర్వహిస్తున్నారు.బ్యారేజీ పిల్లర్ల దిగువన ఉన్న స్ట్రీం వాల్ కొట్టుకుపోకుండా ఉండేందుకు డ్రిల్లింగ్‌చేసి కాపర్ షీట్లను భూమిలలోకి పుంపుతున్నారు. షీట్ల వెనుక భాగంలో తరువాయి 2లో

## అమెరికాలో యాదగిరిగుట్ట యువతి మృతి



ప్రజాపక్షం/ యాదగిరిగుట్ట

ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లి యువతి గుడ్ల సౌమ్య (22) అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో మృతి చెందిన ఘటన ఆదివారం (భారత కాలమాన ప్రకారం) అర్ధరాత్రి చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని గుడ్ల కోటేశ్వరరావు, బాలమణిల కూతురు సౌమ్య ఆదివారం అర్ధరాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా, అతి వేగంగా వచ్చిన ఒక కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తరువాయి 2లో

వైద్య పరీక్షలు చేయించుకుంటా

## బెయిల్ గడువు పొడిగించండి



సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జూన్ 2న తీహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాల్సి ఉంది. ఆ తేదీ సమీపిస్తున్న తరుణంలో తనకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలంటూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిఇటి సిటి స్కాన్ సహా పలు వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉన్నందున మరో వారం రోజుల పాటు తన మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని న్యాయస్థానాన్ని ఆయన కోరారు. ఈ మేరకు వివరాలతో తరువాయి 8లో

మ్యానిఫెస్టోలో వాగ్దానాలను

## 'అవినీతి'గా పరిగణించలేం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసే వాగ్దానాలు ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతి కిందకు రావని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అవి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు అవుతుందని, అంతేకాకుండా పార్టీ అభ్యర్థి కూడా అవినీతి చేయడంతో సమానమని పిటిషనర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. ఈ వాదన విచిత్రంగా ఉందని అభిప్రాయపడిన జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ వీకే విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం.. తగిన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. రాజకీయ పార్టీల 'ఉచితాల'కు సంబంధించిన ఓ కేసు సుప్రీంకోర్టులో పెండింగులో ఉంది. కర్ణాటకలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చింది. చామరాజనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీ జెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ గెలుపొందారు. అయితే, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అవినీతి కిందకే వస్తాయని, అందుకే ఆ పార్టీ నుంచి గెలుపొందిన జమీర్‌ను పక్కన పెట్టాలని కోరుతూ తరువాయి 8లో

## సరిహద్దులు దాటుతున్న సర్కార్ బియ్యం

- ప్రభుత్వ గన్నీ సంచుల్లోనే అక్రమ రవాణా
- లక్షలు కురిపిస్తున్న బియ్యం దందా
- మంథని కేంద్రంగా వ్యవహారం

ప్రజాపక్షం / మంథని



పేదవర్గాల ఆకలి తీర్చాలన్న ఆలోచనతో ప్రభుత్వం సబ్సీడీపై పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. పెద్దపల్లి జిల్లా మంథని కేంద్రంగా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. ఒకప్పుడు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి దాటగానే బియ్యం అక్రమ రవాణా చేసే అక్రమార్కులు ఈనాడు యథేచ్ఛగా పట్టపగలే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అంతేకాకుండా అక్రమ తరలింపులో ప్రభుత్వం సరఫరా చేసే గన్నీ సంచులతోనే బియ్యం బస్తాలను తరలించడం ఎంత పెద్ద ఎత్తున ఈ దందా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. రేషన్ డీలర్లు సైతం ఈ దందాలో భాగస్వాములు అని చెప్పకనే చెప్పవచ్చు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రజాపంపిణీ ద్వారా ఉచిత బియ్యం సరఫరాకు శ్రీకారంచుట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్రీ బియ్యం పంపిణీ జరుగుతోంది. ఈ క్రమంలో కరోనా విపత్కర కాలంలో తనిఖీలు లేకపోవడం అక్రమార్కులు యదేచ్ఛగా గన్నీసంచుల్లోనే బియ్యం తరలించారు. అదే విధంగా ఈనాడు సైతం రేషన్ దుకాణాల నుంచి నేరుగా గన్నీ సంచుల్లోనే తరలిస్తున్న తీరు అధికారులను విస్మయానికి గురిచేసింది. అయితే అక్రమ రవాణా చేస్తూ బియ్యంపట్టుబడితే నామమాత్రపు కేసులతోనే అధికారులు సరిపెట్టడం, తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ వ్యాపారం తరువాయి 8లో

## చమురు ఉత్పత్తి పెంచిన ఇరాన్



టెహ్రాన్ : ఇకమీదట రోజుకు నాలుగు మిలియన్ బ్యారెల్స్ చమురు ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఇరాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. 2018లో అమెరికా ప్రభుత్వం ఇరాన్ దేశంపై ఆంక్షలు విధించ దానికి ముందుకూడా ఈ స్థాయిలో ఏనాడూ ముడి చమురు ఉత్పత్తులు చేయలేదు. ఇరాన్ చమురు మంత్రి జావేద్ ఔజీ గడచిన నవంబరులో చేసిన ప్రకటన ప్రకారం దేశంలో రోజుకు 3.5 బిలియన్ బ్యారెల్స్ చమురు ఉత్పత్తి అవుతున్నది. ఇటీవల [illegible] మంత్రి ఒక నివేదిక పంపుతూ చమురు ఉత్పత్తులు పెంచుతున్నట్లు వార్తలు రాయాలని, ఈ వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 2020 నుండి ఇరాన్ నుండి చమురు ఎగుమతులు గణనీయంగా పెరిగినట్లు మంత్రి జావేద్ ఔజీ చెప్పారు.ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇరాన్ ప్రభుత్వం చమురు, సహజవాయువుల ఉత్పత్తులు గణనీయంగా పెంచడానికి పెట్టుబడుల సమస్య రావడంతో ఆ ప్రభుత్వం తీవ్ర ఆలోచనల్లో మల్లగుల్లాలు పడుతున్నది. దీనికితోడు ఒపెక్, అంతర్జాతీయ ఇంధన సంస్థ కూడా చమురు ఉత్పత్తులపై ఆంక్షలు విధించింది.

## అమెరికాలో టోర్నడో బీభత్సం





అమెరికాలో టోర్నడోలు బీభత్సం సృష్టించడంతో 18 మంది మరణించారు. సెంట్రల్ యునైటెడ్‌స్టేట్స్‌లోని నాలుగు రాష్ట్రాలలో ఆదివారం రాత్రికిరాత్రే టోర్నడోలు బీభత్సం సృష్టించాయి. దీంతో నలుగురు పిల్లలతోపాటు 18 మంది మరణించారు. ఆదివారం నాలుగు రాష్ట్రాలలో ఈ టోర్నడోలు 10.90 కోట్లమందికి వణుకు పుట్టించాయి. రోడ్లు, వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు కూలిపోయాయి. మిడ్ మిసిసిప్పీ, టెన్నెస్సీ రివర్ వ్యాలీ, ఓహియో ప్రాంతాలలో ఎక్కువ నష్టం వాటిల్లింది. చాలా అరుదైన ప్రాంతాలలో వచ్చే తీవ్రమైన టోర్నడోగా దీనిని అధికారులు పేర్కొన్నారు. కుక్ కౌంటీలో ఏడుగురు, ఆర్కాన్సాస్‌లో ఎనిమిదిమంది మరణించారు. కెంటుకీలో ఒకరు, ఈశాన్య ఒక్లహోమాలో ఇద్దరు మరణించారు. మరో 23 మంది గాయపడ్డారు. మరిన్ని టోర్నడోలు వచ్చే ప్రమాదం ఉందని కూడా వాతావరణ నిపుణులు హెచ్చరించారు.

## టర్కీలో ఘోర ప్రమాదం





అంకారా : టర్కీ జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో పదిమంది మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు. దక్షిణ మెర్సిన్ రాష్ట్రం టాగ్ జాతీయ రహదారిపై ఆదివారం ఒక ఇంటర్‌సిటీ బస్, ట్రక్, కారు వరుసగా ఒకదానికొకటి ఢీకున్నాయి. ప్రొవిన్షియల్ గవర్నర్ అలీ హమ్జా పెహ్లివిన్ ఈ విషయం చెప్పారు. వేగంగా వెళుతున్న ప్యాసింజర్ బస్సు వర్షపునీటిలో జారిపడి ఆపోజిట్ లైన్ రహదారిపై అడ్డంగా పడటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకుని ఈ ఘోరం జరిగింది.

# గాజాలో 45మంది సజీవ దహనం

### ఇది ఆటవిక చర్య, పలు దేశాల ఖండన





రఫా : దక్షిణ గాజాలో ఉన్న రక్షిత ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన బాంబు దాడిలో 45 మంది పాలస్తీనా శరణార్థులు సజీవదహనమయ్యారు. దాడుల్లో ఇద్దరు హమాస్ ఉగ్రవాద కమాండర్లు హతులయ్యారని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి, స్పెయిన్, నార్వే, ఐర్లాండ్ సహా పలు దేశాలు ఈ దాడిని ఖండించాయి. ఐతే ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ యుద్ధ విరమణకు తిరస్కరించారు. హమాస్‌ను సమూలంగా తుడిచిపెట్టనిదే యుద్ధం ఆపేదిలేదని మరోసారి స్పష్టం చేశారు. ఈ దాడులు శాంతి చర్చలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఈజిప్టు, ఖతార్ దేశాలు ఖండించాయి. ఈజిప్టు దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్ ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ, ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ఆటవిక దాడులను అడ్డుకునేందుకు తమ దేశం చేయగలిగినదంతా చేస్తుందని అన్నారు. రఫాలో టెంట్లు వేసుకుని ఐక్యరాజ్యసమితి కార్యాలయం సమీపంలో తాల్ సుల్తాన్ శరణార్థ శిబిరాలలో తలదాచుకుంటున్న పాలస్తినా ప్రజలపై సోమవారం జరిపిన బాంబుదాడుల్లో 45 మంది సజీవదహనం కావడం హృదయవిదారకంగా మారింది. జబాలియా, నుసైరాత్, గాజా సిటీలలో ఉన్న శరణార్థ శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేసి 160 మందిని హతమార్చిన తర్వాత తాజాగా ఈ తాల్ సుల్తాన్ శరణార్థ శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేసింది. ఈ ఘటన ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అంతర్జాతీయ న్యాయస్థానం తక్షణం గాజాలో యుద్ధం ఆపాలనీ, రఫా క్రాసింగ్‌ను తెరిచి మానవతా సహాయం పంపించేందుకు ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించినప్పటికీ ఇజ్రాయిల్ సుముఖత వ్యక్తం చేయలేదు. పైగా సోమవారం రఫాలో జరిగిన దాడి అంతర్జాతీయ చట్టాల ప్రకారం సమర్థనీయమేనని బుకాయించింది.

**భూలోక నరకం రఫా: ఐరాస ఆందోళన**

ఇజ్రాయిల్ దాడి తర్వాత రఫా ప్రాంతం భూలోక నరకంగా మారిందని ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆవేదన వ్యక్తంచేసింది. ఇజ్రాయిల్ ఎవరు చెప్పినా, ఎంత చెప్పినా మాట వినడంలేదని, గాజాలో భూలోక నరకాన్ని సృష్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. శరణార్థుల టెంట్ల పై బాంబుదాడుల తర్వాత అక్కడ హృదయవిదారకమైన దృశ్యాలు కనిపించాయి. మృతు ల్లో ఎక్కువమంది మహిళలు, పిల్లలే. అనేకమందిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. రఫాలో ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ బృందాల సమాచారం ప్రకారం మే 6వ తేదీ నుండీ ఈ 21 రోజుల్లో 8,00,000 లక్షలమంది పాలస్తీనియన్లు ప్రాణభయంతోను వదిలి ఇతర ప్రాంతాలకు పారిపోయారు. 2023 అక్టోబరు 7వ తేదీన ప్రారంభమైన యుద్ధం తర్వాత ఇప్పవరకూ గాజా నుండి 20 లక్షలమంది ప్రజలు వలస వెళ్ళిపోయారు. కుటుంబాలు విచ్ఛిన్నమై నిరాశ్రయులై తలో దిక్కునా ఉన్నారు. ఇజ్రాయిల్‌సైన్యం దాడుల్లో 36,000 మంది మరణించారు. వీరిలో 15,239 మంది పిల్లలు ఉన్నారు. మరో 80,643 మంది గాయపడ్డారు. 147 మంది జర్నలిస్టులు, 194 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది, వందలాదిమంది ఆరోగ్య కార్యకర్తలు మరణించారు.


# కొండలు పడి రెండు వేల మంది సజీవ సమాధి



పోర్ట్ మోరెస్బై : పపువా న్యూగినియాదేశంలో జరిగిన అత్యంత ఘోరమైన ప్రకృతి వైపరీత్యంలో 2,000 మంది పైగా గ్రామస్తులు సమాధి అయ్యారు. అనేకమంది జాడ తెలియలేదు. ఈ శతాబ్దంలోనే అత్యంత విషాదకరమైన మానవ విలయంగా పేర్కొన్న ఈ ఘటనలో కొండచరియలు విరిగిపడి ఆరు గ్రామాలకు చెందిన ప్రజలు సమాధి అయ్యారు. ఆస్ట్రేలియాకు ఉత్తరంగా పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న అతిపెద్ద దీవి దేశం పపువా న్యూ గినియాలో 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆరు గ్రామాలపై ఈనెల 24వ తేదీన ఈ చరియలు విరిగిపడ్డాయి. 8 అడుగుల లోతున ప్రజలు సమాధి ఐపోయారు. వారిని వెలికితీసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సఫలం కావడంలేదు. ఎనిమిది అడుగుల ఎత్తున కొండరాళ్ళు పడిపోవడంతో వాటిని తీయడానికి భారీ క్రేన్లు అవసరం అవుతాయి. అలాంటి భారీ క్రేన్లు ఆ దేశంలో అందుబాటులో లేవు. ఈ మానవ విషాదంపై చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్రంగా చలించిపోయిరు. మృతులకు ఆయన తీవ్ర సంతాపం తెలిజేశారు. ఆ దేశానికి తాము పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ప్రకటించారు. మట్టిపెళ్ళలకింద కప్పడిపోయిన వారిని వెలికి తీసేందుకు ప్రజలు తమకకు చేతనైన పద్ధతులలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నారు. రాజధాని పోర్ట్ మోరెస్బైకి 600 కి.మీ దూరంలో ఎంగా రాష్ట్రంలో ఈ ఆరు గ్రామాలు ఉన్నాయి. ఎంగా రాష్ట్రంలోని కయోకాలం గ్రామంలో చరియలు విరిగిపడి చాలా తీవ్ర ప్రాణ నష్టం వాటిల్లిందని ఆ ప్రాంత గవర్నర్ పీటర్ ఇపాటస్ ఎఎఫ్‌పికి చెప్పారు.

# ఆర్మేనియాలో నిరసన ప్రదర్శనలు: 226 మంది అరెస్టు

యెరెవాన్ : ఆర్మేనియాలో సోమవారం నిరసన ప్రదర్శనలు మరింత పెరిగాయి. దేశ ప్రధానమంత్రి నికోల్ పషియాన్‌ను రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ వందలమంది వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. దీంతో పోలీసులు 226 మందిని అరెస్టు చేశారు. ఆర్మేనియా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రధానమంత్రికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. దేశ సరిహద్దుల్లో ఉన్న ఆరు గ్రామాలను అజర్‌బైజాన్ దేశానికి ఇచ్చేయడంతో దేశంలో ప్రధానమంత్రికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు ప్రారంభించారు. ప్రధానమంత్రి దేశాన్ని కాపాడటంలో విఫలమయ్యారనీ, ఆయన రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఆర్మేనియా ఈశాన్యప్రాంతంలోని తవుష్ డైసీస్ ఆర్చ్ బిషప్, ఆర్మేనియన్ అపొస్టోలిక్ చర్చ్‌లో ఉన్నతస్థానంలో ఉన్న క్లెరిక్ బగ్రాత్ గాల్‌స్టానియన్‌ల నాయకత్వంలో ఈ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.



# లిథుయేనియా అధ్యక్ష ఎన్నికల్లో మళ్ళీ నౌసెడా ఘన విజయం



కొపెన్‌హాగన్ : లిథుయేనియా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పదవిలో ఉన్న దేశాధ్యక్షుడు గితనస్ నౌసెడా (60) మరోసారి ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో ఆయనకు 74.5 శాతం ఓట్లు లభించాయి. ప్రధానమంత్రి ఇంగ్రిడా సిమొనైట్ ఆయనపై పోటీ పడ్డారు. సిమొనైట్‌కు 24.1 శాతం ఓట్లు లభించాయి. మోడరేట్ కన్జర్వేటివ్‌గా ముద్రపడిన గితనస్ నౌసెడా ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ మద్దతుదారుడు. ఈ ఎన్నికల్లో కూడా ఆయనకు ఉక్రేన్ మద్దతు లభించింది. పొరుగున బెలారస్‌లో అణచివేతల కారణంగా తరలివచ్చిన వేలాదిమందికి ఆయన గతంలో ఆశ్రయం కల్పించారు. నౌసెడా రష్యా వ్యతిరేకి. లిథుయేనియా దేశం చాలా సున్నితమైనదని, దేశ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, ఐక్యత కూడా చుట్టుపక్కల చిన్న అలజడి వచ్చినా సమస్యల్లో పడుతుందనీ, అందువల్ల దేశాన్ని చాలా జాగ్రత్తగా రక్షించుకోవాల్సి ఉందనీ ఆయన గెలిచిన అనంతరం అన్నారు. బ్యాంకు ఆఫీసర్‌గా పనిచేసిన నౌసెడా 2019 ఎన్నికల్లో మొదటిసారి రాజకీయాల్లో ప్రవేశించి ఇండిపెండెంట్‌గా శ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. విజయం సాధించి ఐదేళ్ళు అధికారంలో కొనసాగారు. ఆయన హయాంలో ప్రస్తుత ఆయన ప్రత్యర్థి సిమొనైట్ ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల ఫలితాల తర్వాత సిమొనైట్ ఓటమిని అంగీకరించి నౌసెడాకు అభినందనలు తెలియజేశారు.

## మేడిగడ్డ సందర్శన

(మొదటి పేజీ తరువాయి)

సిసి పనులు నిర్వహిస్తున్నారు.ఉబికి వస్తున్న నీటిని యంత్రాల సాయంతో తోడుతున్నారు.వర్షాకాలం మొదలు కాకముందే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు,నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు.ఈకమిటీ సభ్యుల్లో ఆపరేషన్ అండ్ మేయింటెనెన్స్ నిపుణులు నాగేందర్ రావు,మోహన్,రామగుండం సర్కిల్ సిఇ సుధాకర్ రెడ్డి ఉన్నారు.

## మళ్ళీ మోదీ రావడం కష్టమే..

(మొదటి పేజీ తరువాయి)

పలిగంజ్‌లో జరిగిన మరో ఎన్నికల ర్యాలీలో రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మూతపడిన అన్ని పరిశ్రమలను తిరిగి తెరుస్తామని, 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని రాహుల్ భరోసానిచ్చారు. రాహుల్ పాల్గొన్న అన్ని ర్యాలీల్లో ఆర్‌జెడి నేత, మాజీ డిప్యూటీ సిఎం తేజస్వి యాదవ్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, వికాస్‌షీల్ ఇసాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేష్ సాన్షి, ఇతర ఇండియా కూటమి నేతలు కూడా హాజరయ్యారు.

**రాహుల్‌కు తృటిలో తప్పిన ప్రమాదం**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సోమవారంనాడు బీహార్‌లో జరిగిన ఎన్నికల సభలో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సభా వేదకలోని కొంత భాగం కిందకు కృంగిపోవడంతో ఆయన అడుగులు తడబడ్డాయి. అయితే వెంటనే నిలదొక్కుకోవడంతో భద్రత సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గంలోని పాలిగంజ్‌లో సోమవారంనాడు ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీని ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మిసా భారతి వేదిక పైకి తీసుకువెళ్తుండగా వేదికలోని ఒక భాగం కిందకు కృంగిపోయింది. దీంతో బ్యాలెన్స్ కోసం రాహుల్ కొద్దిసేపు తడబడ్డారు. వెంటనే ఆ విషయం గ్రహించిన మిసాభారతి ఆయన చేయి పట్టు నిలదొక్కుకునేందుకు సహకరించారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బందిని రాహుల్ ఫరవాలేదంటూ వారించడం, ఆ వెంటనే రాహుల్ నవ్వుతూ వేదికపై నుంచి సభికులకు చేయి ఊపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పాటలీపుత్ర లోక్‌సభ సీటు నుంచి మిసా భారతి పోటీ చేస్తున్నారు.

## వందకుపైగా సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

రక్షించుకునేందుకు మతతత్వ శక్తులను ఓడించడం ఖాయమని చెప్పారు. కేరళలోని కోజికోడ్‌లో ఐయుఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం జరివగిన 'స్నేహ సదస్సు'కు సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మతతత్వ శక్తులను అడుగుపెట్టనీయకుండా చేస్తున్న కేరళ నమూనా రాజకీయాలు దేశానికి అవసరమని అన్నారు. ఇక్కడి వచ్చినప్పుడల్లా వ్యతిరేకంగా పోరాడేందుకు తాను స్ఫూర్తిగా తీసుకుంటానని చెప్పారు. బిజెపి నేతలు అబ్‌కి బార్ చార్ సౌ పార్ అని అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేరళలోని 20 స్థానాలు ఇండియా కూటమికే వస్తాయని, ఎన్‌డిఎకు ఒకటి లేదా రెండు చోట్ల డిపాజిట్లు రావడం కూడా కష్టమేనని అన్నారు. తమిళనాడులో సున్నా స్థానాలు వస్తాయని, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలుపుకొని 20లోపు స్థానాలే ఎన్‌డిఎకు వస్తాయని అన్నారు. దక్షిణాది రాష్ట్రంలో మొత్తం 130 స్థానాలలో ఇండియా కూటమికి వంద ప్లస్ స్థానాలు వస్తాయన్నారు. గత ఎన్నికల్లో గుజారత్‌లోని మొత్తం 26 స్థానాలు హర్యానాలో పదికి పది, ఢిల్లీలో ఏడుకు ఏడు, రాజస్థాన్‌లో 25కు 25 ఎన్‌డిఏకు వచ్చాయని, ఈ సారి అందులో సగానికి సగం తగ్గుతాయని రేవంత్ రెడ్డి వివరించారు. అందుకే ఒక ఇంటర్వ్యూలో తాను 400 పార్ సీట్లు అంటే పాకిస్థాన్‌లో పోటీ చేయాలని చెప్పానని అన్నారు. మోదీకి రెండు సార్లు ప్రజలు అధికారమిచ్చారని, ఈసారి మోదీ గ్యారంటీకి వారంటీ తీరిపోయిందన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు తెలంగాణ రాజు (కెసిఆర్) మాట్లాడినట్లే ఇప్పుడు ఈ రాజు (మోదీ) మాట్లాడుతున్నారని, ఆయన గెలవలేదని, ఈసారి ఈయన కూడా గెలవడని చెప్పారు.

## పట్టభద్రుల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామలో, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి తొర్రూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హనుమకొండలోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌ఏ జగదీశ్‌రెడ్డి, మఠంపల్లి మండల కేంద్రంలో వివేకవర్థిని హైస్కూల్లో నల్గొండ బిజెపి ఎంపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, నల్గొండలో కలెక్టర్ చందన, ఇతర అధికారులు ఓటు వేశారు. సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి జిల్లా తుర్కపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, ఆయన భార్య మమత, వరంగల్ కాశీబుగ్గలోని వివేకానంద కళాశాలలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ ఓటేశారు.

**చెదురుమదురు ఘటనలు:**

ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా పలుచోట్ల చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. జనగామ జిల్లా పాలకుర్తిలోని 28వ పోలింగ్ బూత్ బ్యాలెట్ పేపర్ ముద్రణ సరిగ్గా లేదంటూ 45 మంది ఓటర్లు అభ్యంతరం వ్యక్తం చేయగా, అధికారులు సమస్య పరిష్కరించారు. వరంగల్ ఏవీవీ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద టెంట్లు తొలగించటంపై బిజెపి, బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ తరహా మినహాయిస్తే మిగతా చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాలు మూసివేసి, కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పార్టీలు ఈ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో కార్యకర్తల మధ్య గొడవలు చెలరేగకుండా భారీ బందోబస్తు, నిఘానేత్రాల పర్యవేక్షణతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ పూర్తిచేశారు. బ్యాలెట్ బాక్స్‌లను భారీ భద్రత మధ్య స్ట్రాంగ్‌రూంలకు అధికారులకు తరలించారు. జూన్ 5న ఈ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు జరగనుంది. మరోవైపు ఎన్నికల్లో డబ్బుల పంపిణీ గురించి ప్రశ్నించిన తనపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అశోక్ ఆరోపించారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లిలో హస్తం పార్టీ శ్రేణులు చేస్తున్న నగదు పంపిణీని తాను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, వారు దానిని ధ్వంసం చేసి తనను విచక్షణారహితంగా కొట్టారని వాపోయారు. ఈ మేరకు ఆయన నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం నిరసన వ్యక్తం చేశారు పోలీసులు సైతం అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని అశోక్ ఆరోపణలు చేశారు. 'నార్కట్‌పల్లిలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లాను. అక్కడ ఓ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ నేతలు నగదు పంచుతున్నారనే సమాచారం మాకు అందింది. అడ్డుకునేందుకు వెళ్లిన నన్ను కొట్టారు. నేను వీడియో తీస్తుండగా నా ఫోన్‌ను పగులగొట్టారు. గెలవడానికి కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచుతోంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు' అని అశోక్ అన్నారు.

## ఓటు వేసిన కూనంనేని

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తాజా మాజీ ప్రభుత్వ అభ్యర్థి డబ్బుల పంపిణీతో గ్రాడ్యుయేట్లను ప్రలోభాలకు గురిచేసి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆరేళ్ల పదవిని కట్టబెడితే రాజీనామా చేసి ఉప ఎన్నికకు కారణమైన బిఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అభ్యర్థిని ఎందుకు బరిలో నిలిపిందో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపిని ఆదరించే పరిస్థితిలో లేరని, రెండు కోట్ల ఉద్యోగాల హామీతో గద్దెనెక్కి, కోటి ఉద్యోగాలు రద్దు చేసిన ఆ పార్టీని ప్రజలు నమ్మరన్నారు. ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ అవినీతి పాలనను ఎండగడుతున్న మిత్రపక్షాల అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని, మల్లన్న వైపే పట్టభద్రుదలు అనుకూలంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

## 'రెమల్' తుఫాన్ విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

స్తంభాలు కూలిపోయాయి. కోల్‌కతానగరంలోని అనేక ప్రాంతాలు నీట మునిగి ఉన్నాయి. ఎడతెగని వర్షాలకారణంగా సెంట్రల్ కోల్‌కతా ఎంటల్లీ బిబిర్ బగన్ ఏరియాలో ఆదివారంనాడు సాయంత్రం ఇంటి గోడ కూలిపోవడంతో ఒకవ్యక్తి తీవ్ర గాయాలతో మరణించగా, సుందర్‌బన్స్ డెల్టాకు సమీపం నంఖానా దగ్గర మౌసుని ఐలాండ్‌లో చెట్టుకూలిపోయి ఒక పూరిల్లు మీద పడటంతో ఒక వృద్ధురాలు తీవ్ర గాయాలతో మరణించిందని బెంగాల్ రాష్ట్ర ప్రకృతివైపరీత్యాల నిర్వహణ విభాగాధికారి తెలియజేశారు. అదేవిధంగా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మహేష్టలలో ఒక మహిళ, ఉత్తర 24 పరగణాలజిల్లాలోని పనిహతిలో మరో మహిళ తుఫానులో చిక్కిక మరణించారని చెప్పారు. పూర్బా బర్ధమాన్‌జిల్లాలోని మెమరీలో తండ్రీ కుమారుడూ విద్యుదాఘాతం వల్ల మరణించారు. ''తుఫాను వల్ల మట్టి ఇళ్ళను కోల్పోయినవారికి, పంట నష్టపోయిన వారిక బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాలలో ''రెమల్ తుఫాను బీభత్సం సృష్టించిన తర్వాత సోమవారంనాడు ఆస్తినష్టం వివరాలను వివిధ రకాల ఫోటో చిత్రాలద్వారా అంచనావేశారు. పూరిగుడిసెలు పూర్తిగా గాలికి నాశనమైపోయాయి. చెట్లు పలుచోట్ల కూకటివేళ్ళతోసహా కూలిపోయాయి. కూలిపోయిన చెట్లన్నీ వీధుల్లో అడ్డంగాపడి రాకపోకలను మరింత దుర్భరంగా చేశాయి. ''తుఫాను కారణంగా చాలామంది పేదల పూరిళ్ళు ధ్వంసమయ్యాయి, మట్టి ఇళ్ళు కూలిపోయాయి, ఇళ్ళు కోల్పోయిన పేదలకు, పంటలు నష్టపోయిన రైతులకు పాలనాయంత్రాంగం సహాయం సమకూర్చింది, నేను వాగ్దానం చేస్తున్నా, వారికి కావాల్సిన సహాయం నేను చేస్తాను'' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు.

**కోల్‌కతాలో 190 మిల్లీమీటర్ల వర్షం:**

కాగా విమాన సర్వీసులుసహా కోల్‌కతా నగరంలో పలుచోట్ల సబర్బన్ రైళ్ళు సోమవారం తిరిగి ప్రారంభం అయ్యాయి. సీల్దా నుండి సబర్బన్ రైళ్ళు మధ్యాహ్నం నుండీ నడుస్తున్నాయి. తుఫాను కారణంగా విమాన సర్వీసులను 21 గంటలసేపు నిలిపివేశారు. ఐతే సాధారణ పరిస్థితులు రావడానికి మరికొంత సమయం పడుతుందని విమానాశ్రయం అధికారులు చెప్పారు. కోల్‌కతా నగరంలో గడచిన 24 గంటల్లో 190 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. హాల్దియా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో 110 నుండి 60 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. నగరంలోని అనేక ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. కోల్‌కతా నగరంలో 68 చెట్లు కూలిపోగా, మరో 75 చెట్లు సాల్ట్ లేక్, రాజర్‌హాట్‌లలో నేలకూలాయి. కాగా బిజెపి ఇదే అదనుగా అధికార పార్టీపై దుమ్మెత్తిపోస్తున్నది. టిఎంసి నాయకులు ఈ విమర్శలను తిప్పికొడుతున్నారు. ఒకవైపు వర్షాలు కొనసాగుతుండగా మరోవైపు రాజకీయపార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి.

**అఫ్ఘాన్, బంగ్లాదేశ్‌లలో వరదలు :**

బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, అమెరికాలలో టోర్నడోలు, ఈదురుగాలులు, వరదలు సృష్టించిన బీభత్సకాండలో 37 మంది పైగా మరణించారు. అఫ్ఘానిస్థాన్‌లో తాజాగా మరోసారి వచ్చిన భారీ వర్షాలు వరదల కారణంగా 16 మంది మరణించారు. బంగ్లాదేశ్‌లో 'రెమల్' తుఫాను ఆదివారంనాడు బీభత్సం సృష్టించింది. కోస్తాతీరంలోని పల్లపు ప్రాంతాలకు చెందిన సుమారు ఎనిమిది లక్షలమంది కోస్తా గ్రామాల ప్రజలు వరదలకుభయపడి ఇల్లు వదలి వెళ్ళిపోయారు. ముఖ్యంగా సముద్రాన్ని తన కన్నతల్లిగా, దేవతగా భావించి నిత్యం సముద్రాన్నే నమ్ముకునే జాలర్లు సైతం ఇటీవలికాలంలో తుఫాను బీభత్సాలకు భయపడి కోస్తా ప్రాంతానికి దూరంగా వెళ్లిపోతున్నారు. బంగ్లాలో పల్లపు ప్రాంతమైన ఛార్‌కు మయన్మార్ నుండి వచ్చి తలదాచుకున్న 36 వేలమంది రోహింగ్యా శరణార్థులు వరదలకారణంగా మరిన్ని సమస్యల్లో పడ్డారు. కాగా తుఫాను బాధితులకోసం 57 తుఫాను రక్షణ కేంద్రాలు ప్రారంభించినట్లు బంగ్లాదేశ్‌లో శరణార్థుల అధికారి, కమీషనర్ మహ్మద్ రఫిక్వల్ హక్ చెప్పారు. బంగ్లాదేశ్‌లో మూడు ఓడరేవులు ఉన్నాయి. చిట్టగాంగ్‌లో అతిపెద్ద విమానాశ్రయం ఉంది. ప్రభుత్వం వీటిని తుఫాను కారణంగా మూసివేసింది.

## ఎక్కువ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఐఎండి అంచనా వేస్తున్నది. అదేవిధంగా సెంట్రల్ ఇండియా, దక్షిణాది రాష్ట్రాలలో సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుందని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర సోమవారం పత్రికాగోష్టిలో చెప్పారు. జూన్ నుండి సెప్టెంబరు వరకూ నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో దేశంలో ఈ ఏడాది సాధారణంకంటే ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని గతనెలలోనే ఐఎండి అంచనా వేసింది. ప్రధానమైన వర్షాధార వ్యవసాయ రాష్ట్రాలలో ఈ నాలుగు నెలల్లో మొత్తంగా చూసినప్పుడు 106 శాతం లేదా సగటున 87 సెంటీమీటర్ల వర్షం కురుస్తూ ఉంటుంది. ఈసారి ఇంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో జూన్‌నెలలో సాధారణ వర్షపాతం 92 లేదా 108 శాతంగా ఉంటుంది. దీర్ఘకాలంలో సగటున చూసినప్పుడు దేశంలో జూన్ నెలలో 166.9 మిల్లీమీటర్లుగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ''దక్షిణాది రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలను గనుక వదిలేస్తే జూన్‌నెలలో దేశంలో సాధారణంకంటే హెచ్చుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేశాం'' అని ఆయన అన్నారు. రాబోయే ఐదురోజుల్లో కేరళలో రుతు పవనాలు చాలా అనుకూలంగా ఉన్నాయని అన్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దేశంలో విద్యుత్ గ్రిడ్లకు పరీక్షాకాలంగా మారాయి, దేశంలో కొన్ని ప్రాంతాలలో కరువు తరహా పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు వర్షాలు కురిసే రోజులు తగ్గిపోతుండగా, మరోవైపు భారీగా వర్షాలు కురిసే రోజులు పెరుగుతున్నాయని, అతి తక్కువ సమయలోనే భారీ వర్షపాతం నమోదవుతున్నదనీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 1951 నుండి 2023 వరకూ వరుస గణాంకాలను చూసినప్పుడు ఎల్‌నినో వెంట లానినోలో వర్షాలు ఎక్కువగా కురిశాయి.

## 1న 'ఇండియా' కూటమి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అదే రోజు మధ్యాహ్నం ఢిల్లీలో స మావేశ కావాలని ఇండియా కూటమి నాయకులు ప్రతిపాదించినట్లు వర్గాలు పేర్కొన్నా యి. అయితే కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎను మరోసారి అధికారంలోకి రానీయకుండా అడ్డుకుంటామని ప్రతిపక్ష కూటమి పేర్కొంటున్న విషయం తెలిసిందే. 'ఇండి యా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్న విధితమే. కాగా, జూన్ 1వ ప్రతిపాదిత సమావేశాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పా టు చేస్తున్నట్లు వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని అధికార కూటమి కూడా మూడోసారి కూడా తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**టిఎంసి గైర్హాజరు?:** మరోవైపు జూన్ 1వ తేదీన జరిగే 'ఇండియా' కూటమి సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) గైర్హాజరయ్యే అవకాశాలున్నట్లు వర్గాలు తెలిపాయి. అదే రోజున కీలకమైన కోల్‌కతా దక్షిణ, కోల్‌కతా ఉత్తర పార్లమెంట్ స్థానాలు, ఇతర సీట్లలోనూ పోలింగ్ జరుతుందని టిఎంసి తెలిపినట్లు వర్గాలు చెప్పాయి. టిఎంసి సుప్రీం మమతా బెనర్జీ, పార్టీజాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఇతర అగ్రనేతలు ఓటింగ్‌లో పాల్గొనున్నారు. అందువల్ల ఇండియా కూటమి సమావేశానికి హాజరుకాలేకపోతున్నట్లు వర్గాలు వెల్లడించాయి. అయితే పార్టీ నిర్వాహకులను పంపనున్నారని చెప్పాయి.

## యువతి మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. అమెరికాలో విద్యాభ్యాసం కోసం ఆమె వెళ్ళింది. అత్యున్నత స్థాయికి ఎదుగుతుందనుకున్న కూతురు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సౌమ్య తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించగా యాదగిరిగుట్టలో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సౌమ్య మృతదేహాన్ని అక్కడి నుంచి స్వగ్రామానికి రప్పించేందుకు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రమాద జరిగిన సంఘటన వివరాలను వారికి వివరించి అక్కడి రాయబార అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని విజ్ఞప్తి చేశారు విద్యార్థి మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు.

## జూన్ 3 నుంచి ఎస్ఎస్‌సి సప్లమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జూన్ 3 నుంచి 13 వ తేదీ వరకు ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గం.ల నుండి మద్యాహ్నం 12.30 గం.ల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల కోసం 51,231 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వీరిలో బాలురు 31,625 మంది కాగా, బాలికలు 19,612 మంది ఉన్నారన్నారు. హాల్ టిక్కెట్లు, ఇతర వివరాల కోసం ww.bse.telangana.gov.in ను సంప్రదించవచ్చని సూచించారు.

## ఆరేళ్ల సమీకృత బిటెక్ డిగ్రీ

### అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం బాసర ఆధ్వర్యంలో 6 సంవత్సరాల సమీకృత బిటెక్, డిగ్రీ విద్యా కార్యక్రమానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైంది. మొదటి సంవత్సరం 2024/25లో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా సమీపంలోని టిఎస్ ఆన్‌లైన్, మీ సేవ, విశ్వ విద్యాలయం వెబ్ సైట్ www.rgukt.ac.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అభ్యర్థులు జూన్ 1 నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్లడించింది. ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడానికి చివరి తేదీ 22 జూన్ 2024 అని మరిన్ని వివరాల కోసం పైన తెలిపిన వెబ్‌సైన్ ను సందర్శించవచ్చని వెల్లడించింది.

## గురుకుల ఉద్యోగాల భర్తీకి 29 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురకుల విద్యా సంస్థల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పిఇటి) ఉద్యోగాల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల ఈ నెల 29 నుంచి జూన్ 4వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ర్యాంకుల వారిగా అభ్యర్థులు 29వ తేదీ ఉదయం 10గంటల నుంచి హైదరాబాద్, నాంపల్లిలోని టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు. ఏమైనా ధృవీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నట్లయితే జూన్ 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని, ఆ తర్వాత దాఖలు చేసే సర్టిఫికెట్లను అనుమతించబోమని స్పష్టం చేశారు.

## ఆదాయం ఎలా పెంచారో చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదాయం పెంచుతున్నామని చెబుతున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,శ్రీధర్ బాబు ఎలా ఆదాయం పెంచారో చెప్పాలని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెండర్ల ఆరోపణలపైన సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పాత్ర లేకపోతే టెండర్లను రద్దు చేసి తన నిజాయితీ నిరూపించుకోవాలని సూచించారు. ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అవినీతిపైన బిఆర్ఎస్ న్యాయ పోరాటం చేస్తుందని తెలిపారు. ఆర్ ఆర్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

## ఆస్తులను ధారదత్తం చేస్తున్న మోదీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ఆస్తులను పోగుచేస్తే, మోదీ ప్రభుత్వం ఆ ఆస్తులను ధారదత్తం చేస్తుందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ నెహ్రూ తన దూర చూపుతో ప్రాజెక్టులను, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎఫ్‌సిఐని ఏర్పాటు చేశారని, దేశంలో ధాన్యం నిల్వలకు ఆయనే నాంది అని గుర్తు చేశారు. . కాంగ్రెస్ హయాంలోనేఎస్ఆర్ఎస్‌పి, మంజీరా,.సింగూరు లాంటి ప్రాజెక్టులను నిర్మిస్తే, బిజెపి,బిఆర్ఎస్ నేతలు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్, కిషన్‌రెడ్డి మంజీరా,సింగూరు నీళ్లు తాగినవాళ్లే కదా అని ప్రశ్నించారు. మోదీ పదేళ్ళలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారని, ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించారా అని నిలదీశారు. కాంగ్రెస్ విశాఖ ఉక్కును తీసుకొస్తే, మోదీ దానిని అమ్మకానికి పెట్టారని ఎద్దేవా చేశారు. పిసిసి ఎవరన్న అంశంపైన సోషల్ మీడియాలో చర్చ జరుగుతుందని, తమ పార్టీలో ఎవరైనా పిసిసి పదవి అడుగొచ్చని, కానీ బిజెపిలో పదవులు అడిగితే ఉన్న పదవి పోతుందని అన్నారు.

## రైల్వే పోలీసులకు చిక్కిన అంతరాష్ట్ర గంజాయి ముఠా

### ముగ్గరి అరెస్టు రూ.15 లక్షల గంజాయి స్వాధీనం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిషా నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా గుట్టును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ముగ్గరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రైల్వే మరియు రోడ్ సేఫ్టీ అదనపు డిజిపి ఎం.మహేష్ భగవత్ ఒక ప్రకటనలో మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని గజపతి జిల్లాకు చెందిన కూలీ చాంద్ కుమార్ నాయక్ (30), మిహిర్ (31), చిద (28) మరో ముగ్గరు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు తక్కువ ధరకు ఒడిశాలో గంజాయిని సేకరించి ఎక్కువ ధరకు మహారాష్ట్రలో విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో ఈ ముఠా సోమవారం రైలులో రూ.15 లక్షల విలువైన 62 కిలోల పొడి గంజాయిని తరలిస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో చాంద్ కుమార్ నాయక్‌తో పాటు మిహిర్, చిదలు పట్టుబడగా మరో ముగ్గరు నిందితులు పరారీలో ఉన్నారు. అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టును రట్టు చేసిన రైల్వే పోలీసులను అదనపు డిజిపి మహేష్‌భగవత్ అభినందించారు.

### పట్టభద్రుల ఉపఎన్నిక ఓటింగ్

# రెండవ ప్రాధాన్యత ఓటే కీలకం

### డబ్బుల పంపిణీలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ముందంజ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడిచిన తర్వాత కూడా ప్రజల్లో సానుకూలత కనిపిస్తుంది. శాసన సభ ఎన్నికలలో కనపడిన కాంగ్రెస్ అనుకూలతే పార్లమెంటు ఎన్నికల్లో కనిపించింది. శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పట్ల సానుకూలత కనిపించినా కాంగ్రెస్ అభ్యర్థి పట్ల పట్టభద్రుల ఓటర్లలో విముఖత కనిపించింది. 34 శాసన సభ నియోజక వర్గాలు, 12 జిల్లాలు, మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న ఈ పట్టభద్రుల నియోజక వర్గంలో 32 చోట్ల కాంగ్రెస్ శాసన సభ్యులే ఉన్నారు. మొత్తం ఏడుగురు మంత్రుల పరిధిలో ఈ శాసన మండలి నియోజక వర్గం ఉంది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల సంఖ్యకు తగినట్లుగా ప్రచారం జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అభ్యర్థిపై ఉన్న వ్యతిరేకతను కొందరు ఓటర్లు వివిధ సంఘాల వారు ప్రశ్నించడంతో నేతలు పలు చోట్ల ముఖం చాటేశారు. కాంగ్రెస్ క్యాడర్‌లో కూడా అంత ఉత్సుకత కనిపించ లేదు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పై వచ్చిన విమర్శలను ముఖ్యంగా కేటిఆర్, హరీష్ రావు ఆ పార్టీ నేతలు చేసిన విమర్శలను తిప్పి కొట్టడంలో కాంగ్రెస్ కాస్త వెనుకంజ వేసిందని చెప్పవచ్చు. బిఆర్ఎస్ అభ్యర్థి పట్టభద్రులకు డబ్బులు చేర్చడంలో సఫలీకృతులయ్యారు. బిఆర్ఎస్ క్యాడర్ కూడా పార్లమెంటు ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో పకడ్బందీగా ఓటర్లను కలిసి తమ వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నం చేసింది. బిఆర్ఎస్ పట్ల వ్యతిరేకత ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి పట్ల అంతగా సానుకూలత లేకపోవడం బిఆర్ఎస్‌కు కొంత మేర కలిసొచ్చింది. అది గెలుపు దాకా తీసుకు వస్తుందా అన్న అనుమానం కూడా లేకపోలేదు. బిజెపి పట్ల ఎక్కడ సానుకూలత కనిపించ లేదు. మూడో స్థానానికే పరిమితం కావచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచారంలోను ఇతరత్రా వ్యవహారాల్లోను బిజెపి వెనుకబడింది.

**రెండవ ప్రాధాన్యత కీలకం :** సోమవారం జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే తొలి ప్రాధాన్యతతో ఫలితం వెల్లడయ్యే అవకాశం కనిపించడం లేదు. రెండవ ప్రాధాన్యత ఓటు లెక్కింపక తప్పని స్థితి. పోలింగ్ రోజు ముందు వరకు తొలి ప్రాధాన్యత ఓటు తోనే గెలుపోటములు నిర్ణయించబడతాయని రాజకీయ పార్టీలు భావించినప్పటికీ పోలింగ్ తర్వాత ఆ పరిస్థితి లేదు. 52 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ మూడు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్యనే పోటీ ఉండే అవకాశం కనిపిస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కి పడిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువగా పోలయ్యాయి అనే దానిపై ఫలితం ఆధారపడి ఉంటుంది. మొత్తంగా ఈ ఎన్నికల్లో అంత ప్రాధాన్యత కలిగినవి కాకపోయినా గ్రామీణ ప్రాంతాల నుంచి రాజకీయ పార్టీల కార్యకర్తలు ఎన్నికల పట్ల ఉత్సుకత ప్రదర్శించారు.

# నెహ్రూ సెక్యూలర్‌వాది

### కేంద్ర విశ్వవిద్యాలయ మాజీ వైస్‌ఛాన్స్‌లర్ రాజేన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్రీయ దృక్పథాన్ని విశ్వసించే సెక్యూలర్‌వాది అని కేంద్ర విశ్వవిద్యాలయ మాజీ వైస్‌ఛాన్స్‌లర్ రాజేన్ హర్షే అన్నారు. సోష లిజంతోనే ఆర్థిక ప్రజాస్వామ్యం ఉంటుందని నెహ్రూ భావించేవారన్నారు. దేశ తొలిప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా ఇంటలెక్చువల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో సోమవారం జరిగిన ''నెహ్రూ,భారత దేశ ప్రజాస్వామ్యం'' అనే అంశంపైన రాజేన్ హర్షే ప్రసంగించారు. నెహ్రూ తన ఆలోచనాస్వేచ్ఛను మేథో, పత్రికాస్వేచ్ఛగా ప్రోత్సహించే వారని, జాతీయ, అంతర్జాతీయంగా పౌర హక్కుల కోసంపోరాడిన సాంప్రదాయ ఉదారవాది అని గుర్తు చేశారు. నెహ్రూ అన్ని మత విశ్వాసాలనూ గౌరవించేవారని,లౌకిక నాయకుడని రాజేన్ హర్షే వివరించారు.ప్రజాస్వామ్యానికి అంతర్జాతీయ కోణం కూడా ఉన్నదని విశ్వసించేవారన్నారు. అలీన సమూహ నాయకునిగా నెహ్రూ భారతదేశం స్వతంత్రంగా ఉండేలా చూసేందుకు చాలా కష్టపడ్డారని, అనైతికత భారతదేశ జాతీయవాదానికి తార్కిక విస్తరణ,రష్యా,అమెరికాలో చేరలేదని తెలిపారు. నెహ్రూ చేసిన అలైన్‌మెంట్ విధానమే అంతర్గత విధ్వంసం,బాహ్య దురాక్రమణ నుండి భారతదేశాన్ని రక్షించిందని, విదేశాంగ విధాన వ్యూహం అంతర్గత రాజకీయాల్లో ఉప వ్యవస్థగా మారిందని తెలిపారు. ఆయన అన్ని రకాల స్వేచ్ఛలను విశ్వసించే ప్రజాస్వామ్యవాదని కొనియాడారు. నెహ్రూ హయాంలోనే అనేక ఆర్థిక, పరిశోధన సంస్థలు వచ్చాయని రాజేన్ హర్షే తెలిపారు. ఎంఎల్‌సి జీవన్ రెడ్డి మాట్లాడుతూ దేశం ఈ స్థాయిలో ఉన్నదంటే అందుకు కారణమే నెహ్రూ అని అన్నారు. వ్యవసాయ, పారిశ్రామికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.కొన్ని దృష్ట శక్తులు దేశానికి ఆయన చేసిన సేవలు , త్యాగాన్ని తగ్గించేందు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నెహ్రూ ప్రతిష్టను తగ్గించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.నెహ్రు దేశాన్ని దూర దృష్టితో చూశారని, నెహ్రూను విమర్శించే వారిని చూసి నిజమైన దేశ భక్తులు ఇప్పుడు బాధ పడుతున్నారని తెలిపారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమి కొట్టినప్పుడు మన దేశంలో గుండు సూది కూడా తయారు కాలేదని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నెహ్రు దేశాన్ని నడిపించారన్నారు. పంచవర్ష ప్రణాళికలను, దేశంలో డ్యామ్‌లు నిర్మించిందే నెహ్రూ అని గుర్తు చేశారు. ప్రధాని మోదీ ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. కాగా అంతకుముందు ఇందిరా భవన్ లో నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు.

# రిజర్వేషన్లు పెంచకపోతే కాంగ్రెస్‌పై యుద్ధమే

### జూన్ 10 వరకు ఎదురుచూస్తాం

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హెచ్చరిక




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలలోపే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు పెంచాలని, లేని పక్షంలో జూన్10 తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారుపై ఇక యుద్ధం ప్రకటిస్తామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. సోమవారం ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ తదితరులతో కలిసి మంద కృష్ణ మాదిగ మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో ఏ నిర్ణయమైనా తీసుకోవాలని అన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా రాష్ట్రంలో పోరాటం మొదలవుతుందని, ఆ పోరాటం రేవంత్‌కు రాజకీయ ఉరితాడు అవుతుందని మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కంటే ముందే రిజర్వేషన్లు పెంచకపోతే ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 5000 కోట్లపైగా నష్టపోతారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల నోటి కాడ కూడును ఎవరికి ఇవ్వడానికి ఇలాంటివి చేస్తున్నారని నిలదీశారు. ఇకనైనా రేవంత్ తీరు మార్చుకోకపోతే ఎస్‌సి, ఎస్‌టి బిసిల పోరాటం మొదలవుతుందని, ఆ పోరాటం చివరికి రాజకీయ ఊరితాడుగా మారుతుందన్నారు. అందుకే కాంగ్రెస్‌కు జూన్ 10 వరకు గడువు ఇస్తున్నామని, ఆ లోపే నిర్ణ యం తీసుకోవాలన్నారు.

# ఒక్క ప్రశ్నకే సమాధానం

### బిజెపి ఎల్‌పి నేత మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పౌర సరఫరాల శాఖలో చోటుచేసుకుంటున్న అక్రమాలపై తాను 19 ప్రశ్నలతో ముఖ్యమంత్రికి లేఖ రా స్తే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేవలం ఒక్క ప్రశ్నకు మాత్రమే జవాబివ్వడం శోచనీయమని బిజెపి శాసనసభా పక్ష నాయకులు ఏలే టి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పౌరసరఫరాల శాఖలో అక్రమాలను వెల్లడించిన తనపై మం త్రి వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా మంత్రికి ధైర్యముంటే పౌర సరఫరాల శాఖలో జరుగతున్న అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేకపోతే సిబిఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను పైరవీ చేసి బిజెపి శాసనసభా పక్ష నా యకుడిగా పదవిని తెచ్చుకున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన ఆ రోపణలను ఖండిస్తున్నానని, అందరి నాయకుల సమన్వయంతో తనకు పార్టీ ఆ పదవి ని ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలి సి10 ఏళ్లు పనిచేశానని, మంత్రి మాదిరిగా తానుదిగజారి ఆరోపణలు చేయలేనని, ఉత్తంకుమార్ టిపిసిసి అధ్యక్ష పదవి ఎలా తెచ్చుకున్నారో నాకు తెలియ దా అన్నారు. తమ పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అనుమతితోనే సిఎం రేవంత్‌రెడ్డిని కలిశానన్నా రు. మంత్రి చేసినవ్యాఖ్యలు తనను కాకుండా సిఎంను అవమానపర్చేవిధంగా ఉన్నాయన్నారు.

## ఎసిబికి చిక్కిన వ్యవసాయాధికారి



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం ఎసిబి అధికారులకు దహేగాం మండల వ్యవసాయ అధికారి వంశీ కృష్ణ రూ. 38 వేల నగదు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన చౌదరి శ్యాం రావ్ ఫెర్టిలైజర్ షాపు నడుపుకుంటున్నాడు. తన షాపు సీడ్ లైసెన్స్ నిమిత్తం వ్యవసాయ అధికారిని కలువగా లంచం డిమాండ్ చేశాడు. అంత డబ్బులు ఇచ్చుకోలేని శ్యామ్ రావు చేసేది లేక ఎసిబిని ఆశ్రయించాడు. దీంతో ఎసిబి అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం సోమవారం వ్యవసాయ కార్యాలయంలో వంశీ కృష్ణను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు అధికారి రమణమూర్తి తెలిపారు.

## అక్రమ మద్యానికి తలుపులు తెరిచారు: మన్నె

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అక్రమ మద్యానికి తలుపులు తెరిచారని బిఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. సాక్షాత్తు ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు కొత్త మద్యం కంపెనీ అంశంలో అబద్దాలు చెబుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోం డిస్టిలరీస్ కంపెనీ తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న విషయం మంత్రి జూపల్లికి తెలుసా అని ప్రశ్నించారు. సోం డిస్టిలరీస్‌పైన అనేక సార్లు రైడ్స్ జరిగాయన్నారు.

# గొర్రె కాపర్ల సమస్యలను పరిష్కరించాలి

### మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించిన తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వం హాయంలో రెండవ విడుత గొర్రెల పంపిణీలో భాగంగా తమకు గొర్రెలు వస్తాయని ఆశతో నిరుపేద గొల్ల, కురుమల అప్పులు చేసి మరి డబ్బులు చెల్లించి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ గొర్రెలను అందకపోగా, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గొర్రె కాపరుల సమస్యను వెంటనే పరిష్కరించాలని శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కకు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం అధ్యక్షతన హైదరాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో మంత్రి సీతక్కకు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, గొర్రెల మేకల పెంపకం వత్తిదారుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారి బేరి రామచందర్ యాదవ్ నేతృత్వంలో పలువురు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి గారి దగ్గరికి తీసుకెళ్లి డీడీలు కట్టిన గొల్ల కురుమలకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, బిసి ఫెడరేషన్ అధ్యక్షులు సాయన్న ముదిరాజ్, బిసిఐక్యవేదిక యూత్ అధ్యక్షులు అందెల కుమార్ యాదవ్. వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు గజ్జి రమేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆవుల రాజు యాదవ్, మంచిర్యాల జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జీ కాటవేణి మహేష్ యాదవ్, బిసి యూత్ అధ్యక్షులు కుమార్ యాదవ్ ,గొల్ల, కురుమల సంఘం జిల్లా నాయకులు ఉన్నారు.

## ఇఎస్ఐ ఆసుపత్రుల అద్దెబకాయిలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఇఎస్ఐ కార్పొరేషన్ పరిధిలోని 75 ఆసుపత్రులకు సంబంధించిన అద్దెలబకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్రప్రధానకార్యదర్శి ఎస్.బాలరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇఎస్ఐ కార్పొరేషన్ పరిధిలో సంఘటిత, అసంఘటిత రంగాలలోని లక్షలాది మంది ఇఎస్ఐ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య బీమా సౌకర్యంతో పాటు వైద్య పరీక్షలు, మందులు ఖరీదైన చికిత్సల కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్‌కు రిఫర్ చేస్తూ ఇయస్ఐ లబ్ధిదారులకు లాభం చేకూరుస్తున్నాయని, ఇఎస్ఐ ఆసుపత్రుల అద్దెలు చెల్లించకపోవడంతో గత 6 నెలలుగా ఆసుపత్రులకు తాళాలు వేసినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. భవన యాజమానులు తాళాలు వేసి హాస్పటల్స్‌ను మూసివేసినా ప్రభుత్వం కార్మికుల కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రులు మూతపడటం వల్ల ఆసుపత్రులలో వచ్చే నెలవారి మందులు లేక బయట మెడికల్ షాపులలో కొనే స్తోమత లేక చాలా మంది రోగాలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఇటీవలి కాలంలో అనేక మంది వ్యాధులు ముదిరిపోయి మందులు లేక చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇఎస్ఐ కార్పొరేషన్ లోకల్ ఆఫీసు యంత్రాంగం యధావిధిగా కార్మికుల జీతాల నుండి ఇఎస్ఐ కాంట్రిబ్యూషన్‌ను తమ ఖాతాలో వేసుకుని కనీస మానవత్వం లేకుండా రోగులను రోడ్డుపాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇఎస్ఐ ఆసుపత్రులను యధావిధిగా కొనసాగిస్తూ ఉద్యోగ, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం నిర్విరామంగా కొనసాగించేందుకు వెంటనే ఆసుపత్రుల భవన యజమానులకు అద్దెలు చెల్లించాలని ఆయన ఆయన డిమాండ్ చేశారు.

## ఇంటర్ వాల్యూయేషన్‌పై తక్షణ విచారణ

### ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ పరీక్షల జవాబుపత్రాల వాల్యూయేషన్ తప్పులపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి, తప్పుడు వాల్యుయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్‌బోర్డ్ న్యాయం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు ఇంటర్ జవాబుపత్రాల వాల్యుయేషన్‌లో నిర్లక్ష్యం, అలసత్వం వహించి తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడం వల్ల ఫలితాల అనంతరం మార్కులు చూసి వేలాది మంది మెరిట్ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పరీక్ష రాసిన అనంతరం తమకు ఏ సబ్జెక్ట్ లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే అంచనాకు వచ్చారని, ఆ మేరకు మార్కులు రాకపోవడంతో రివాల్యుయేషన్, రీకౌంటింగ్‌తో జవాబుపత్రాలు తెప్పించుకుని చూస్తే పేపర్ వాల్యువేషన్ చేసిన వారి తప్పులు బయటపడ్డాయన్నారు. జవాబుపత్రాలను ఇష్టానుసారంగా వాల్యుయేషన్ చేయడం ద్వారా మార్కులు ఒక విధంగా ఉంటే ఆన్‌లైన్ మరో రకంగా మార్కులు వేశారన్నారు. జవాబుపత్రాల వాల్యువేషన్ ఇష్టానుసారంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొవాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోటనట్లయితే ఇంటర్ బోర్డును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## కౌంటింగ్ కేంద్రాలకు కలెక్టర్లు, కమిషనర్లు, ఎస్‌పిల క్యూ

### చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్ సభ ఎన్నికలు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కేంద్రాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు క్యూ కడుతున్నారు. త్వరలో జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లను వీరు పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న సమస్య రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అక్కడున్న పోలీస్ సిబ్బందికి, సెంట్రల్ బలగాలకు పలు భద్రతా పరమైన సూచనలు చేశారు. జూన్ 4వ తేదీన జరపతలపెట్టిన ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు, లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లను వీరు పరిశీలిస్తున్నారు.ఎక్కడైనా ఏ చిన్న లోపం ఉన్నా వెంటనే సరిదిద్దే విధంగా సిబ్బందికి సలహాలు, సూచనలు కూడా చేశారు. కౌటింగ్ కేంద్రాలను కలెక్టర్‌లు, పోలీసు ఉన్నతాధికారులు కలిసి అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న సమస్య రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచిస్తున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 43 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్క హైదరాబాద్‌లోనే 16 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయి. లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీసులతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాలు కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తులో ఉంటాయి. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే పార్టీల ఏజెంట్లు, ఎంపి అభ్యర్థులకు ఇప్పటికే ఎన్నికల సంఘం పాస్‌లను తయారు చేసింది. ఇక మీడియా ప్రతినిధులకు సైతం పాస్‌లను కేటాయించారు. పాస్ లేని ఎవరిని కౌంటింగ్ కేంద్రాల్లోకి రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లకు సెల్‌ఫోన్‌లు, వాటర్ బాటిల్స్ తీసుకురావద్దని సూచించారు.ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో 14 ఏర్పాటు చేస్తున్నారు. డిజిపి రవిగుప్తా ఆదేశాల మేరకు కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా జనరేటర్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. నీరు, అల్పాహారం, భోజన ఏర్పాట్లు సైతం చేస్తున్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, మే 28

# ప్రజాస్వామ్యం దుర్వినియోగం

దేశానికి ప్రజాస్వామ్యబద్ధమైన పరిపాలన ఇవ్వటానికి ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఎంత దిగజారుడు ప్రసంగాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారో ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో మనం చూస్తున్నాం. అది కొత్త కాకపోయినా, అధికారంకోసం పెనుగులాట తీవ్రరూపందాల్చినప్పుడు అది వెర్రితలలు వేస్తుంది. వచ్చేనెల 1వ తేదీ చివరిదశ పోలింగ్‌తో ఎన్నికల ప్రక్రియ క్లయిమాక్స్‌కు చేరుతుంది. ఈ ఎన్నికల్లో ప్రజల నిత్యజీవిత సమస్యలు చర్చకు రాకుండా పాలక బిజెపి జాగ్రత్త పడింది. 2014లో అవినీతి, 2019లో పుల్వామా దాడి నేపథ్యంలో టెర్రరిజం ప్రధాన సమస్యలుగా దేశవ్యాప్త చర్చనీయాంశాలైనాయి. వాటికి దట్టించిన కాంగ్రెస్ వ్యతిరేకత, పాకిస్థాన్ బూచిగా జోడించిన జాతీయోన్మాదం బిజెపికి సీట్ల గెలుపు వరద పారించాయి. ఈ పర్యాయం అటువంటి భావోద్వేగ, జాతీయతత్వ సమస్య ఏదీ ఎజెండాలోకి రాకపోగా, ప్రతిపక్ష పార్టీలు ‘‘ఇండియా’’ కూటమిగా ఏర్పడి బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ దుష్పరిపాలనకు సవాలు విసిరాయి. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం ప్రతిపక్షాలను నిందించడానికి బిజెపికి ఉపకరించిందిగానీ అది ఆశించిన మేరకు ఓట్లు కురిపించలేకపోయింది. ‘‘మూడోసారి మోదీ–ఈసారి 400 సీట్లుకుపైగా’’ నినాదం బూటకమని తేలిపోయింది. ఎప్పుడూ ప్రతిపక్షాన్ని సంజాయిషీ ఇచ్చుకునేస్థితిలోకి నెట్టే బిజెపిని ఈసారి అది సంజాయిషీ ఇచ్చుకునేస్థితిలోకి నెట్టేయడంలో ప్రతిపక్షం సఫలమైంది. బిజెపికి 400 సీట్లు ఇస్తే అది రాజ్యాంగాన్ని సవరించి ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి రిజర్వేషన్‌లకు ఎసరు పెడుతుందనే ప్రతిపక్ష ఆరోపణ కరెంటు ప్రసరణలాగా జనంలోకి వెళ్ళి బిజెపిని ఉక్కిరిబిక్కిరి చేసింది. దిక్కుతోచనిస్థితిలో పడిన స్టార్ క్యాంపెయినర్లు ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా మతపరంగా ప్రజలను విభజించే పాత ఆయుధాన్ని దుమ్ముదులిపి బయటకు తీశారు. ‘‘ఇండియా’’ కూటమి అధికారంలోకి వస్తే (అది బిజెపికి ఊహించటానికే భయంకరమైన స్థితి) హిందువుల ఆస్తులు, మంగళసూత్రాలు సహా లాక్కుని ముస్లింలకు పంచిపెడుతుందనే దుష్ప్రచారం ప్రారంభించారు. అదీ జనాలను ఒప్పించలేదనుకున్నారేమో, రామాలయం కూల్చివేస్తారు, రాముణ్ణి మళ్ళీ గుడారంలో పెడతారంటూ వెకిలి ప్రచారానికి దిగజారారు. ‘‘ఇండియా’’ కూటమే రాజ్యాంగాన్ని సవరించి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు లాగేసుకుని ముస్లింలకు ఇస్తారని ఎదురు దాడి చేస్తున్నారు. పోలింగ్ చివరిదశకు వచ్చినా తూర్పు ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలసభల్లోనూ అదే పాట. మోదీ తాను అవతార పురుషుణ్ణని చెప్పుకున్నాగానీ జనాలు నమ్మలేదు. హిమాచల్ ప్రదేశ్ నాలుగు లోక్‌సభ స్థానాలు కలిగిన చిన్న రాష్ట్రం. గత ఎన్నికల్లో ఆ నాలుగు సీట్లూ బిజెపివే. ఇంతలో వచ్చిన మార్పు ఏమిటంటే ఆ రాష్ట్రంలో సంవత్సరం క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం బిజెపికి పుండుపై కారం చల్లినట్లయింది. డబ్బు కుమ్మరించి ప్రభుత్వాలను స్వాధీనం చేసుకునే తమకు అలవాటైన ఆయుధం ప్రయోగించి ఫిబ్రవరిలో అరడజను కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన గూటికి ఆకర్షించింది. ఐతే స్పీకర్ వారి శాసనసభ్యత్వాన్ని రద్దుచేయడంతో ఆ స్థానాలకు కూడా ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ మాజీ ఎమ్మెల్యేలే బిజెపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటం బిజెపి ప్రాధాన్యతగా ఉంది. ప్రధానమంత్రి స్వయంగా ఆ హెచ్చరిక చేశారు కూడా. హిమాచల్ ప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డా స్వరాష్ట్రం. ఏది ఏమైనా, రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ ఈ ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశం కావటం స్వాగతించదగినది. రాజ్యాంగ నిర్దేశన ప్రకారం అణగారిన, సామాజికంగా వెనుకబడిన కులాల ప్రాతిపదికపై కాకుండా ఆర్థిక వెనుకబాటుతనం ప్రాతిపదికగా రిజర్వేషన్లు ప్రతిపాదించేది ఆర్‌ఎస్‌ఎస్. దాని సర్‌సంఘ్ ఛాలక్ మోహన్ భాగవత్ సైతం అసాధారణంగా బయటకు వచ్చి రిజర్వేషన్లకు ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ వ్యతిరేకం కాదని చెప్పుకోవలసి వచ్చిందంటే రిజర్వేషన్ల రద్దు సెగ బిజెపికి ఎంత తీవ్రంగా తగిలిందో అర్థం చేసుకోవచ్చు. దాన్ని తట్టుకోవటానికి మోదీ బృందం రాజ్యాంగ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదంటున్నది. ‘‘ఇండియా’’ కూటమి అధికారంలోకి వస్తే ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి రిజర్వేషన్లు తగ్గించి ముస్లింలకు ఇస్తుందని నిందాప్రచారం మొదలుపెట్టింది. అది నాలుకా..తాటిమట్టా!

## నేతల నోళ్లకు.. నిషేధం లేదా!

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ దీర్ఘకాలం పాటు (ఏప్రిల్ 19 మొదలు జూన్ 1వ తేదీ వరకు 7 దశలుగా జరుగుతున్నందున ఎప్పటికప్పుడు ప్రచారసాధనాలు ఒపీనియన్ (ఎగ్జిట్) పోల్స్ ప్రసారం చేస్తే, అది తదుపరి దశలో ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేయవచ్చునన్న సదభిప్రాయంతో ఎన్నికల కమిషన్ ఆ పోల్స్ ప్రసారాన్ని జూన్1 సాయంత్రం 5 గంటలవరకు నిషేధించింది. మీడియా ఎగ్జిట్ పోల్స్‌కు ఎంతో కొంత ఓటర్లను ప్రభావితంచేసే శక్తి ఉందన్న నమ్మకం ఇందుకు కారణం. ఇది పూర్తి వాస్తవం అయినా కాకపోయినా ఎన్నికల నిర్వహణ తాబేలు నడకలా తయారైన నాటి నుండీ ఆచరించబడుతున్న సాంప్రదాయం. కాని అదే సమయంలో రాజకీయ ముఖ్యనేతలు ఎన్నికల ఫలితాల గూర్చి చేసే క్లెయిములపై ఆంక్షలులేవు. వాటిని ప్రజలు సీరియస్‌గా తీసుకోరన్నది ఎన్నికల కమిషన్ అభిప్రాయం. అయినా ముఖ్య రాజకీయ నాయకులు –ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే వంటి వారు తమ పార్టీలు గెలుపొందే సీట్ల సంఖ్యపై జోస్యాలు చెబుతూనే ఉన్నారు. ఐదవ దశ పోలింగ్‌తోనే తమ పార్టీ 310 సీట్లు తమ ఖాతాలో వేసుకుందని అమిత్ షా గంభీరంగా ప్రకటించారు. ఎన్నికలు ముగిసేసరికి ముందే నిర్ణయించుకున్న 400 సీట్లు దాటతామన్నది ఆయన విశ్వాసం. మోదీ కూడా ఎటువంటి తడబాటు లేకుండా 2019 నాటి సంఖ్యకు మించి ఎన్‌డిఎ విజయాలు సాధిస్తుందన్నారు. తమ పార్టీకి ఓట్లు, సీట్లు రెండూ పెరుగుతాయంటున్నారు అమిత్ షా. తమ సంక్షేమం, సాధికారీకరణ పథకాల గూర్చి రైతుల్లో కూడా ఉత్సాహం వెల్లివిరుస్తోంది. అన్నిటికన్నా ముఖ్యంగా 60 కోట్ల మంది లబ్ధిదారులు ప్రధానమంత్రి మోదీ వెనుక బలంగా నిలబడి ఉన్నారు. ఇది బిజెపికి విజయం చేకూర్చుతుంది’’ అన్నారు అమిత్ షా.‘‘బిజెపి దక్షిణాదిరాష్ట్రాల్లో కూడా ఏకైక పెద్ద పార్టీగా అవతరిస్తుంది. ఎన్‌డిఎ కూటమి 400 సీట్లు పైగా గెలుచుకుంటుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడు మీరే చూస్తారు’’ అంటూ ప్రధాని మోదీ అతిశయించిన ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తానేమీ తగ్గేది లేదంటూ, ‘‘మోదీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించేందుకు తగినన్ని సీట్లు ఇప్పటికే ఇండియా కూటమికి వచ్చాయన్నారు. బిజెపికి 200 సీట్లు దాటవు’’ అన్నారు. ఇవి ఊహాజనిత సంఖ్యలా, వాటికి గణాంక ఆధారమైనా ఉందా అన్నదానితో ఎన్నికల కమిషన్‌కు నిమిత్తం లేదు.

## జూలై 4న బ్రిటన్ ఎన్నికలు

# టోరీలకు శృంగభంగం తప్పదా!


ఎం. కోటేశ్వరరావు

బ్రిటన్ పార్లమెంటు గడువు వచ్చే ఏడాది జనవరి వరకూ ఉన్నప్పటికీ జూలై నాలుగున ముందస్తు ఎన్నికలు జరిపేందుకు ప్రధాని రిషి సునాక్ నిర్ణయించాడు. లేబర్ పార్టీతో పోల్చితే టోరీల పలుకుబడి 21పాయింట్లు తక్కువగా ఉన్నట్లు సర్వేలు చెబుతుండగా తీసుకున్న ఈ నిర్ణయం అనేక మందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. అక్టోబరు లేదా నవంబరులో ఎన్నికలకు వెళతారన్న పండితుల అంచనాలు తలకిందులయ్యాయి. ఇటీవలి కాలంలో రిషి సునాక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువలన రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు, ఓటమి తీవ్రత ఎక్కువగా ఉండవచ్చు గనుక దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలన్న చందంగా ఇప్పుడు ఎన్నికలు జరిపితే ఓడినా గౌరవ ప్రదంగా కొన్ని సీట్లు తెచ్చుకోవచ్చన్న ఎత్తుగడే ప్రధానంగా కనిపిస్తోంది. మేనెల పదమూడవ తేదీ సర్వేప్రకారం లేబర్ పార్టీ 44, టోరీలు 23పాయింట్లతో ఉండగా ప్రధాని రిషి సునాక్ పనితీరు బాగోలేదన్నవారు గత ఏడాది జూన్‌తో పోల్చితే 57 నుంచి 65శాతానికి పెరిగారు. వ్రతం చెడినా ఫలం దక్కుతుందా ?

సునాక్ దంపతుల సంపద 12 కోట్ల నుంచి 65.1కోట్ల పౌండ్లకు పెరిగిందని తాజాగా సండే టైమ్స్ ధనికుల జాబితాలో ప్రకటించింది. కానీ ప్రధానిగా జనాభిమానం మాత్రం దిగజారుతోంది. పద్నాలుగేండ్ల టోరీల పాలన పొదుపు చర్యలతో జనం విసిగిపోయారు. అన్ని విధాలుగా కార్మికవర్గం దెబ్బతిన్నది. లండన్ కింగ్స్ కాలేజీ జరిపిన అధ్యయనం ప్రకారం 201020 సంవత్సరాల మధ్య ప్రభుత్వ పొదుపు విధానాల వలన 148వేల మంది మరణించారు. ఇండ్ల అద్దెలపై అదుపుఅదుపూ లేదు, బలహీనవర్గాల ఇండ్ల పథకాన్ని రద్దు చేశారు. ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలలో బ్రిటన్ ఒకటిగా చెబుతున్న సంగతి తెలిసిందే. జనాభా 6.7 కోట్ల మందిలో ఒక ప్రమాణాన్ని తీసుకుంటే కోటీ పది లక్షలు, ఇండ్ల ధరలను కూడా పరిగణనలోకి తీసుకుంటే 1.44 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు అంచనా. పిల్లల్లో 42.2లక్షల మంది దారిద్ర్యంలో ఉన్నారు. పది సంవత్సరాల క్రితం ఈ సంఖ్య 22.8లక్షలు.202122లో దాదాపు 2.8లక్షల కుటుంబాలకు ఇళ్లు లేవు. అక్కడ ఉన్న చట్టాల ప్రకారం ఎవరికైనా ఇల్లు లేకపోతే కనీసం ఆరునెలలు ఉండేందుకు ప్రభుత్వం ఇంటి వసతిని చూపాల్సి ఉంటుంది. ఎక్కడో ఒక దగ్గర నిద్రపోతూ పని చేసే వారు గణనీయంగా ఉన్నారు. అలా నిద్రపోతూ దొరికిన వారికి వెయ్యి పౌండ్ల వరకు జరిమానా విధించే నిబంధనలను ప్రభుత్వం చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుదల కారణంగా జీవన వ్యయం విపరీతంగా పెరిగింది. మనదేశంలో తగినంత ఉపాధి చూపటంలో విఫలమైన నరేంద్రమోడీ సర్కార్ నిర్వాకం కారణంగా పేదలు ఆహారధాన్యాలు కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉన్నారు. ఈ కారణంగానే 80కోట్ల మందికి నెలకు ఐదు కిలోల చొప్పున ఐదేండ్ల పాటు ఉచితంగా ఇస్తున్నట్లు సరిగ్గా ఎన్నికలకు ముందు ప్రకటించిన సంగతి తెలిసిందే. బ్రిటన్‌లో తినటానికి తిండి దొరకనివారికి ఆహార కూపన్ల ద్వారా వారానికి మూడు రోజుల పాటు ఆహార పొట్లాలను అందిస్తారు. వాటిని ఆహార బ్యాంకులని ముద్దుపేరుతో పిలుస్తారు. ట్రసెల్ అనే పేరుతో ఉన్న ఒక ట్రస్టు నిర్వహిస్తున్న ఆహార బ్యాంకు నుంచి 200809లో కేవలం 25,899 మంది ఇలా ఆహార పొట్లాలతో కడుపు నింపుకుంటే 2022–23నాటికి ‘‘మన హిందువు, భారత సంతతి’’గా అనేక మంది కీర్తించిన రిషి సునాక్ ఏలుబడిలో వారి సంఖ్య 29లక్షల 86వేల 203కు పెరిగింది. పొట్టచేతబట్టుకొని లేదా అణచివేతలను తప్పించుకొనేందుకు శరణార్థులుగా వచ్చే వారిని సహించలేని స్థితిలో బ్రిటన్ పెట్టుబడిదారీ వర్గం ఉన్నదంటే అతిశయోక్తి కాదు. దీన్ని ఎదుర్కొనేందుకు, అనుమతి లేకుండా వచ్చే వారిని బలవంతంగా ఆఫ్రికాలోని ర్వాండా దేశానికి తరలించి అక్కడ శిబిరాల్లో ఉంచి వారికి బ్రిటన్‌లో ఆశ్రయం కల్పించాలా లేదా అన్నది నిర్ణయించేందుకు ర్వాండా ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకున్నది బ్రిటన్. అందుకు గాను ప్రతి మనిషికి ఇంత అని చెల్లిస్తుంది. ఉదాహరణకు మూడు వందలు అంతకు మించి జనాలను పంపితే పన్నెండు కోట్ల పౌండ్లు ప్రభుత్వానికి, ఇరవైవేల చొప్పున శరణార్థులకు చెల్లిస్తుంది. డబ్బుకక్కుర్తితో ర్వాండా సర్కార్‌కూడా శరణార్థులను స్వీకరించేందుకు అంగీకరించింది. ముందు ర్వాండాకు తరలించి బ్రిటన్‌లో ఆశ్రయం కల్పించేదీ లేనిదీ అక్కడ విచారిస్తారు. ఆశ్రయం కల్పించేందుకు నిర్ణయిస్తే బ్రిటన్‌కు తిరిగి అనుమతిస్తారు లేకపోతే ర్వాండా అంగీకరిస్తే అక్కడే ఉండేందుకు లేదా మూడో దేశం ఏదైనా అంగీకరిస్తే అక్కడకు పంపుతారు. ఇంగ్లీషు ఛానల్ దాటి పడవల ద్వారా అనుమతి లేకుండా ప్రవేశించిన వారు స్వచ్ఛందంగా వెనక్కు వెళ్లిపోయేందుకు అంగీకరిస్తే వారికి మూడువేల పౌండ్లు ఇస్తారు, లేకుంటే విమానాల ద్వారా ర్వాండాకు బలవంతంగా తరలిస్తారు. సుప్రీం కోర్టు ఈ ఒప్పందం చట్టవిరుద్ధమని కొట్టివేసిన తరువాత తీర్పును వమ్ము చేస్తూ మరొక చట్టాన్ని 2023నవంబరులో పార్లమెంటు ఆమోదించింది. దీని మీద కూడా పిటీషన్లు దాఖలైతే విచారణకు 25 కోర్టు గదులు, 150 మంది న్యాయమూర్తులను సిద్ధంగా ఉంచారు. తన కుటుంబం ఆఫ్రికా నుంచి వలస వచ్చిన సంగతి గుర్తుంటే వలస వచ్చిన వారిని బలవంతంగా ర్వాండా పంపే కార్యక్రమానికి రిషి సునాక్ పూనుకొని ఉండేవాడు కాదు. ఓడమల్లయ్యబోడి మల్లయ్య కథ మాదిరి ఒక కార్పొరేట్‌గా తన వర్గ స్వభావాన్ని ప్రదర్శించాడు. టోరీల పద్నాలుగేండ్ల చరిత్రను చూసినపుడు ప్రతి ప్రధానీ విఫలం చెందినట్లు రుజువైంది.ముందస్తు ఎన్నికలతో రిషి సునాక్ కూడా చారిత్రక వైఫల్యాన్ని అంగీకరించినట్లే. ‘‘ ఇది ఏం చేయాలో తోచని వ్యక్తి ఆడుతున్న ఆట,దారులు కూడా మూసుకుపోయాయి, తన అవకాశాలు మెరుగుపడతాయన్న ఆశ సైతం కనిపించని స్థితి ’’ అని ఫైనాన్సియల్ టైమ్స్ రాసింది. మార్చినెలలో 3.2శాతం ఉన్న ద్రవ్యోల్బణం ఇప్పుడు 2.3శాతానికి తగ్గటం తన ఘనతే అని చెప్పుకుంటూ ఆయన ఓటర్ల ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.2008 సంక్షోభం నుంచి బ్రిటీష్ పెట్టుబడిదారీ విధానం ఇంకా కోలుకోలేదని, అంతకు ముందుతో పోలిస్తే ఏడాదికి ప్రతి కార్మికుడు సగటున పద్నాలుగు వేల పౌండ్లు నష్టపోతున్నట్లు ఒక అంచనా వెలువడింది.వేతన పెరుగుదల తీరుతెన్నులు చూస్తే నెపోలియన్ యుద్ధాల (180315) తరువాత ఇంత అధ్వాన్నంగా ఎప్పుడూ లేదని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో సునాక్ ప్రకటనతో అధికారం ముందుగానే దక్కనుందనే సంతోషంతో ప్రతిపక్ష లేబర్ పార్టీ పండుగ చేసుకుంటున్నది. జూలై నాలుగు స్వాతంత్ర్యదినమని కొందరు వర్ణించారు. పిచ్చి పని అని టోరీ ఎంపీలు తమలో తాము గొణుక్కుంటున్నారు. కార్మికుల మీద దాడులు జరిపిన టోరీ పాలనకు స్వస్తి చెప్పేందుకు ముందుగానే వచ్చిన అవకాశమని కార్మిక సంఘాలు కూడా ఎన్నికలను స్వాగతించాయి. అయితే కెయిర్ స్టార్మర్ నాయకత్వంలో ఏర్పడే లేబర్ పార్టీ ప్రభుత్వం పట్ల అప్రమత్తగా ఉండాలని కూడా కొన్ని సంఘాలు హెచ్చరించాయి. కార్మికవర్గ జీవితాలను ఫణంగా పెట్టి తాము బయటపడాలని కార్పొరేట్‌శక్తులు చూస్తున్నాయని, స్టార్మర్ యజమానులకు, ఇజ్రాయెల్‌కు అనుకూలం, కార్మికులు, వలసలకు వ్యతిరేకి అని పేర్కొన్నాయి. ఇటీవల లేబర్ పార్టీ ప్రకటనలు చూస్తే యజమానులకు అనుకూలంగా ఉన్నందున ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచీ ప్రతిఘటించాల్సిందేనని సోషలిస్టు వర్కర్ వంటి సంస్థలు స్పష్టం చేశాయి.ఎవరు గెలిచినా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరు కొనసాగాల్సిందేనని పేర్కొన్నాయి.బ్రిటన్ ప్రజాప్రతినిధుల సభ(కామన్స్)లోని 650 స్థానాలకు గాను 2019 ఎన్నికల్లో కన్సర్వేటివ్(టోరీ) పార్టీ 43.6శాతం ఓట్లతో 365, లేబర్‌పార్టీ 32.1 శాతం ఓట్లతో 202 సీట్లు తెచ్చుకుంది. ఈసారి ఎన్నికల్లో టోరీ పార్టీకి 98, లేబర్ పార్టీకి 468 వస్తాయని సండే టైమ్స్ సర్వే పేర్కొన్నది. అనేక మంత్రులు కూడా ఓడిపోనున్నట్లు జోస్యం చెప్పింది. ప్రధాని రిషి సునాక్ కూడా ప్రత్యర్థికంటే కేవలం 2.5శాతం ఆధిక్యంతోనే ఉన్నట్లు, ఓడిపోయినా ఆశ్చర్యం లేదని చెప్పింది. వేల్స్, స్కాట్లండ్ ప్రాంతాలలో, లండన్ నగరంలో ఒక్క సీటూ గెలిచే అవకాశం లేదన్నది.





# ముస్లింల స్థితిగతుల గురించి సచార్ ఏమన్నారు?

ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ముస్లింలను సంతృప్తి పరుస్తోందని, ముస్లింలకు వనరులను తిరిగి కేటాయిస్తానని వాగ్దానం చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపిస్తూ తీవ్రమైన చర్చను ప్రారంభించారు. అది మతపరమైన విభజనను, ముస్లింలపై మెజారిటీ హిందూ జనాభాలో ద్వేషాన్ని పెంచడంపై మాత్రమే ఉద్దేశించిదని అందరికీ తెలుసు. హిందూ మహిళల నుంచి మంగళసూత్రాలు, బంగారాన్ని జప్తు చేసి ముస్లింలకు తిరిగి పంచిపెడతారని, మోదీ తప్పుడు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో దేశంలోని ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ స్థితిగతులను పరిశీలించడం చాలా అవసరం. వనరులలో ఎక్కువ భాగం కొంతమంది క్రోనీ క్యాపిటలిస్టులకు ఉదారంగా బహుమతిగా ఇవ్వడం శోచనీయం.

2005లో అప్పటి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సమాజంలో ముస్లింల స్థితిగతులను నివేదించేందుకు, పరిస్థితిని సరిదిద్దడానికి పరిష్కార చర్యలను సూచించాలని జస్టిస్ సచార్ అధ్యక్షతన ఏడుగురు సభ్యుల కమిటీని నియమించింది. కమిటీ 403 పేజీల నివేదిక నవంబర్ 2006లో సమర్పించింది, 30 నవంబర్ 2006న లోక్‌సభలో సమర్పించబడింది. భారతదేశంలోని ముస్లింలకు సంబంధించిన దిగ్భ్రాంతికరమైన గణాంకాలను కమిటీ మొదటిసారిగా వెల్లడించింది. సచార్ కమిషన్ అందించిన గణాంకాలు 2020కి నవీకరించబడ్డాయి, కానీ పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదు.

### వెనుకబాటుతనం

దేశంలో 20 కోట్లముస్లింలు ఉన్నారు. కానీ కేవలం 12 శాతం మంది మాత్రమే పాఠశాలల్లో నమోదు చేసుకున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో కేవలం 10.7 శాతం మంది మాత్రమే ఉన్నారు (AISHE,ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జిల్లాల వారీగా సర్వే, 2020–21). ఆసక్తికరంగా, 43% ముస్లింలు ఉన్నత విద్యాసంస్థల్లో నమోదు చేసుకున్న ఏకైక రాష్ట్రం కేరళ మాత్రమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం పేదలకు 4% రిజర్వేషన్లను ఉపసంహరించుకుంది. అదేవిధంగా, పట్టణ ముస్లింలలో దాదాపు 15.6% మంది సాధారణ వేతన ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. ఆక్స్‌ఫామ్, 2022 ప్రకారం, గ్రామీణ ముస్లిం నిరుద్యోగం 31.4%. ఇతర వర్గాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోని ముస్లింలలో ఎక్కువ మంది స్వయం ఉపాధిలో నిమగ్నమై సగటున రూ. 11,421 సంపాదిస్తున్నారు. ఈ సర్వేలు భారతదేశంలోని ముస్లింల దుస్థితిపై దిగ్భ్రాంతికరమైన గణాంకాలను వెల్లడించాయి. సచార్ కమిటీ నివేదిక, సిఫార్సులు దేశంలోని రాజకీయ, సామాజిక, మేధో వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కానీ పరిస్థితి మారలేదు. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లింల దుఃఖకరమైన స్థితిని విస్మరించాయి.

### రగిలిపోతున్న శత్రుత్వాలు

2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బిజెపి హిందూ జాతీయవాద అజెండాను చురుకుగా అనుసరించడం ప్రారంభించింది. 2019లో మోడీ తిరిగి ఎన్నికైన తర్వాత, ప్రభుత్వం వివాదాస్పద విధానాలను అమలు చేయడం ప్రారంభించింది, హక్కులు, మత స్వేచ్ఛ, లక్షలాది ముస్లింల హక్కులను విస్మరించింది. వివాదాస్పద పౌరసత్వ చట్టం ప్రవేశపెట్టడం ముస్లిం వ్యతిరేక విధానాలకు స్పష్టమైన ఉదాహరణ.

మన రాజ్యాంగం సామాజిక సమానత్వం, లౌకికవాదం, మత స్వేచ్ఛ, వివక్ష రహిత సమతా సూత్రాలను పొందుపరిచింది. ఆర్థిక స్వేచ్ఛను సాధించడంలో మతపరమైన వివక్షకు దూరంగా పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశిస్తుంది. అందువల్ల, ముస్లింలు, హిందువులలో పేదలను విభజించి గౌరవప్రదమైన జీవితాన్ని పొందకుండా వారిని దూరంగా ఉంచడానికి హిందూ జాతీయవాదుల అక్రమ ఆకృతులను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

**డా. సోమ మర్ల**

# గర్భిణులలో డిప్రెషన్..

ప్రపంచ వ్యాప్తంగా ఏ కార్య సాధనకైనా ముందుగా కావలసింది ఆరోగ్యం. ఆరోగ్యం విలువ అనారోగ్యంతో బాధపడేటప్పుడు మాత్రమే తెలుస్తుంది. అందుకే ‘ఆరోగ్యమే మహాభాగ్యం‘అంటారు. తల్లి అంటే పిల్లలు కనే యంత్రం కాదు, పిల్లలకు ఆరోగ్యం సమకూర్చే,అవసరాలు తీర్చే ఏటీఎం సెంటర్ అంతకన్నా కాదు?. సర్వ జగతికి సార్వభౌమత్వం సైతం అమ్మఒడితో సమానం కానే కాదు. అమ్మపాలు అమృతం.. ఇచ్చిన తల్లికి తాగిన బిడ్డకి పరమానంద సంధాన సేతువు. అలా తల్లి కష్టాలను, నష్టాలను చివరికి విషాన్ని సైతం కడుపులో జీర్ణించుకొని అమృతపాల(జీవ)ధారలతో బిడ్డ ప్రాణాలు నిలుపుతూ బ్రతుకును ప్రసాదిస్తుంది. తల్లి కాబోతున్న ప్రతి స్త్రీ శరీరం గర్భధారణ సమయంలో శారీరకంగా, మానసికంగా చాలా మార్పులకు లోనవుతుంది. దీంతో గర్భిణీ స్త్రీలు అప్పుడప్పుడు ఆందోళన, నిరాశకు లోనవుతుంటారు.విచారం, కోపమనేది అందరిలోనూ కలిగేదే.. కొందరిలో ఇది ఎక్కువగా ఉంటుంది. గర్భిణులలో ఈ లక్షణాలు ఉన్నట్లయితే అది డిప్రెషన్ కు దారి తీస్తుంది. ఒత్తిడికి గురయ్యేలా చేస్తుంది. చిన్న విషయాలకి ఆందోళన చెందడం వల్ల రక్త ప్రసరణలో మార్పులు జరిగే ప్రమాదం ఉంది. ప్రసవ సమయంలో కలిగే భయం,ఎక్కువ ఆందోళనలకు గురిచేస్తాయి. వీటితో పాటు అనేక ఆరోగ్య సమస్యలు ఈ సమయంలో చుట్టుముట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా గర్భిణీల్లో 10 శాతం, బాలింతల్లో 18 శాతం మంది మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారని లాన్సెట్ తాజా నివేదిక వెల్లడించింది. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో వీరు నిస్పృహ, ఆందోళన, మానసిక వేదనకు లోనవుతున్నారని పేర్కొంది. దీంతో చాలామంది తమ ప్రసవ సమయంలో ఆత్మహత్యలకు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది.ఈ ధోరణి కారణంగా సంపన్న దేశాల్లో 5 నుంచి 20 శాతం వరకు ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని వెల్లడించింది. చాలా వరకు కేసులు అధికారుల దృష్టికి రాకపోవడంతో ఈ మరణాల సంఖ్య పేద దేశాల్లో ఇంకా ఎక్కువగా ఉండొచ్చు అని తెలుస్తుంది.ప్రసవానంతరం దాదాపు 85 శాతం మహిళల్లో కనిపించే ఆందోళన, విచార, దుఃఖం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ కారణంగా కూడా బాలింతలు ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటున్నాయని నివేదిక వివరించింది. ప్రసవానంతరం వచ్చే మానసిక ఆరోగ్య పరిస్థితులు ఇటు తల్లి, అటు శిశువుల ఎదుగుదల(శ్రేయస్సు)ను ప్రభావితం చేస్తాయి.ముఖ్యంగా తల్లీబిడ్డల మధ్య ఏర్పడాల్సిన ప్రేమానుబంధం, శిశు సంరక్షణ వంటివి కొరవడితే, అది పిల్లల శారీరక ,మానసిక ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని పేర్కొంది. తద్వారా కుటుంబాలు, భవిష్యత్తు తరాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని వివరించారు. ప్రధానంగా లాన్సెట్ నివేదిక ఏం చెప్తుంది అంటే? ప్రసవానంతరం 85శాతం తల్లులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ప్రతికూల నమ్మకాలు ప్రసూతి మానసిక వైద్య చికిత్సకు దూరం చేస్తున్నాయి.తక్కువ, అతి తక్కువ ఆదాయ దేశాల్లో నమోదు కాని కేసులు ఎక్కువ.దీని నివారణకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలి. గర్భిణులు,బాలింతలకు మానసిక ప్రశాంతతను కల్పించేందుకు తక్షణ చర్యలు అవసరం.అందుకు కుటుంబాలు, ఆర్థిక పరిస్థితులు, అంగన్వాడి సెంటర్లు ఎంతో దోహదకారిగా ఉండాలి.ఈ సమయంలో వారికి అన్ని విధాలుగా సంపూర్ణ సాయం, సంరక్షణ లభించేలా చూడాలి.చాలా మంది మహిళలు తమలోని మానసిక అనారోగ్య,బలహీన లక్షణాలను బయట పెట్టడం లేదు. వారి మానసిక ఆరోగ్య స్థితిని తెలుసుకునేందుకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని నొక్కి చెబుతుంది.గర్భిణులు,బాలింతల మానసిక ఆరోగ్య సంరక్షణకు వారిలో అవగాహన కల్పించాలి. ఈ విషయంపై వారితో బహిరంగంగా చర్చించి వారికి అవసరమైన సాయం అందిస్తామన్న భరోసా కల్పించాలి. మానసిక రుగ్మతుల బారిన పడిన మహిళల కోసం అవసరం మేరకు అత్యాధునిక వైద్య చికిత్స,కౌన్సెలింగ్ సెంటర్లను అందుబాటులోకి తేవాల్సివుంది. అయితే గర్భిణులు బాలింతలపై క్లినికల్ ట్రైల్స్ నిర్వహించడానికి నైతిక పరమైన ఒత్తిడిల కారణంగా ప్రస్తుత కాలంలో నూతన చికిత్స విధానాలను కనుగొనడం ,ఔషధాల ఉత్పత్తి సవాలుగా మారి,పరిశోధకులకు ఆటంకంగా మారింది.ఈ నివేదిక మేరకు 70 శాతం మహిళలు మానసిక ఆరోగ్య లక్షణాలను దాచి పెడుతున్నారు. కుటుంబ ప్రభావం ప్రసవానంతరం తల్లి మానసిక ఆరోగ్య సమస్యలు శిశువు ఎదుగులపై ప్రభావం చూపుతాయి. ప్రసవానంతరం 85శాతం మందిలో ఈ మానసిక ఆందోళన లక్షణాలు,సంపన్న దేశాల్లో 20శాతం, పేద దేశాల్లో అధికంగా ఉన్నాయి. ప్రేమించే మనం రాబోయే తరాన్ని సృష్టించే గర్భవతులైన తల్లుల, ప్రసవించిన బాలింతల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం తగునా.. గర్భిణీ స్త్రీలు,బాలింతలు మానసిక ఆందోళన సమస్య నుండి బయటపడడానికి పౌష్టికాహారం, మానసిక ప్రశాంతత కలిపించడంలో కుటుంబ సహకారం ఎంతో అవసరం.‘గర్భిణీ స్త్రీ గర్భగుడిలోని దేవత కన్నా మిన్న‘ అని పెద్దలుఅంటారు.గర్భిణులు, బాలింతలను,నవజాత శిశువులను విస్మరిస్తే!మానవ జాతి సృష్టి దేశ ప్రగతి కుంటుపడిపోతుంది.

**మేకిరి దామోదర్, 9573666650**


# కొత్తగా 10 పంట రక్షణ ఉత్పత్తుల విడుదల

భారతదేశపు సుప్రసిద్ధ వ్యవసాయ పరిష్కారాల ప్రదాత కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మే24న, పంట దిగుబడిని పెంపొందించడం, చీడపీడలను నియంత్రించడం, దేశవ్యాప్తంగా పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా 10 కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. వీటిలో మూడు పేటెంట్ కలిగిన ఉత్పత్తులు, ఒక వినూత్నమైన వేప పూతతో కూడిన బయోప్లాంట్ , సాయిల్ హెల్త్ ప్రమోటర్, భారతీయ రైతుల కోసం అధిక ప్రభావవంతమైన సమగ్ర పంట రక్షణ పరిష్కారాలను అందించే ఐదు జెనెరిక్ ఫార్ములేషన్స్ ఉన్నాయి.కాండం తొలుచు పురుగులు మరియు ఆకు ముడత వంటి విధ్వంసక తెగుళ్ల నుండి వరి పంటను రక్షించడానికి అధునాతన జపనీస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే పేటెంట్ ఉత్పత్తి ‘ ప్రచండ్ ను విడుదల చేసేందుకు కంపెనీ ISK జపాన్‌తో భాగస్వామ్యం చేసుకుంది , ఇది రైతుకు 70% వరకు పంట దిగుబడి నష్టాలను తగ్గిస్తుంది. మొక్కజొన్న పంటలను నాశనం చేసే మరొక అత్యంత విధ్వంసక తెగులు (ప్రతి సంవత్సరం 30% వరకు నష్టం) కత్తెర పురుగు. మొక్కజొన్న రైతులు ఈ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కంపెనీ చాలా ప్రత్యేకమైన ఫార్ములాను అభివృద్ధి చేసింది. పంట ఆరోగ్యం మరియు దిగుబడిని మెరుగుపరచడానికి రెండు విప్లవాత్మక పేటెంట్ పొందిన శిలీంద్రనాశకాలు విడుదల చేయబడ్డాయి: 1) వరిలో విస్తృతంగా సంభవించే వ్యాధి (షీత్ బ్లైట్ ( పాము పొడ) అని పిలువబడే శిలీంధ్రాల దాడి) దీర్ఘకాలిక నియంత్రణ కోసం; మరియు, 2) బంగాళాదుంప, ద్రాక్ష మరియు టమోటా పంటలలో సమగ్ర వ్యాధి నియంత్రణ కోసం కాంటాక్ట్ (ఉపరితలం) మరియు క్రమబద్ధమైన చర్య (దీర్ఘకాల నియంత్రణ కోసం పంట ద్వారా గ్రహించబడుతుంది) రెండింటినీ అందించే వినూత్న శిలీంద్ర సంహారిణి పరిష్కారం. కంపెనీ ఐదు కొత్త జనరిక్స్ ను కూడా విడుదల చేసింది, ఇందులో 3 హెర్బిసైడ్‌లు ఉన్నాయి.

ఈ పరిచయాలతో, కోరమాండల్ యొక్క సొల్యూషన్ పోర్ట్‌ఫోలియో , పలు రకాల తెగుళ్ల ను నియంత్రించడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్న భారతీయ రైతుల వివిధ వ్యవసాయ అవసరాల కోసం సమగ్ర పంట రక్షణ పరిష్కారాలను అందిస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా , ఈ వ్యాపారం కొత్త ఫార్ములేషన్‌లను ప్రవేశపెట్టడం ద్వారా దాని ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేస్తోంది మరియు ఆర్థిక సంవత్సరం 2324లో విక్రయాలలో కొత్త ఉత్పత్తుల వాటా 15%గా ఉంది. ఈ సంవత్సరంలో కొత్త ఉత్పత్తి పరిచయాలు కంపెనీ నుండి ఉత్పత్తి ఆఫరింగ్స్ ను మరింత మెరుగుపరుస్తాయి. సిపిసి , బయో ప్రొడక్ట్స్ అండ్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ దేవరకొండ, ఈ ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ , ‘ కోరమాండల్ ఇంటర్నేషనల్ ఒకే సంవత్సరంలో 10 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. జపనీస్ సహకారం తో అభివృద్ధి చేసిన ఒక ఉత్పత్తి, ప్రచండ్‌తో పాటుగా మా అంతర్గత పరిశోధన ద్వారా నాలుగు ఉత్పత్తులు రూపొందించాము.

రైతులకు సేవ చేయడంలో మా నిబద్ధత పరిశోధనఆధారిత వినూత్న పరిష్కారాలను అందించడానికి మా పరిశోధన మరియు అభివృద్ధి ప్రయత్నాలలో స్పష్టంగా కనిపిస్తుంది. విస్తృత స్థాయి నేచురల్ క్రాప్ ఎసెన్షియల్స్ (బయోలాజికల్స్) మద్దతుతో, కోరమాండల్ సమగ్ర పంట నిర్వహణ విధానాన్ని అవలంబిస్తోంది, పత్తి, వరి, మిరప, సోయాబీన్స్, పప్పుధాన్యాలు మరియు కూరగాయలతో సహా కీలక పంటల కోసం విత్తనం నుండి కోత వరకు రైతులకు సమగ్ర పరిష్కారాలను అందిస్తోంది. వ్యవసాయ ఆవిష్కరణలలో కోరమాండల్ ముందంజలోనే ఉంది. ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడంలో రైతులకు సహాయం చేయడానికి డ్రోన్ ఆధారిత స్ప్రేయింగ్ మరియు క్రాప్ డయాగ్నస్టిక్స్ సేవలను పరిచయం చేసింది‘ అని అన్నారు.

## ప్రభుత్వ విప్ ఓటింగ్ సరళి పరిశీలన



**ప్రజాపక్షం/ఆలేరు :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఓటింగ్ సరళిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టబద్రులందరూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మంచి మెజార్టీతో గెలుస్తున్నాడని ధీమా వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, ఆలేరు ఎంపీపీ గంధమల్ల అశోక్, టౌన్ అధ్యక్షుడు ఎజాస్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మండల వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, సింగిల్ విండో డైరెక్టర్ సాగర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ వెంకటస్వామి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే

**ప్రజాపక్షం/ సూర్యాపేట :** పోలీస్ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాదితుల నుండి 6 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు పరిధిలోని ప్రతి అంశాన్ని పరిశీలించి సమస్యల పరిష్కారం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని సూచించారు. భార్యభర్తల తగాదాలు పెరిగిపోయి కుటుంబం విడిపోవడంతో పిల్లల భవిష్యత్తు కోల్పోతారని, సమాజంలో గౌరవం తగ్గుతుందని భార్యభర్తలు సమస్యలను అధిగమించి మంచి తల్లిదండ్రులుగా ఉండాలని సూచించారు.

## అనుమతిలేని పాఠశాలలను బహిర్గతం చేయాలి




పలు విద్యార్థి యువజన సంఘాలు వినతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలలో ఫీజులను బహిర్గతం చేసి నోటీస్ బోర్డులో పెట్టాలని, అనుమతి లేని పాఠశాలలను బహిర్గతం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, బిసి విద్యార్థి సంఘం లెంకలపెల్లి అనిల్, ఎంఎస్ఎఫ్ చెంచు నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌లు కలెక్టరేట్‌లోని ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. ట్యూషన్ ఫీజు మొత్తం ముందుగానే చెల్లించాలని తల్లిదండ్రులకు మెసేజ్ పెడుతూ ఇబ్బంది పడుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలో ఫీజులను నోటీస్ బోర్డుపై పెట్టి బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వలన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నా కానీ అధికారులలో మాత్రం ఎలాంటి స్పందన కనిపించడం లేదన్నారు. కనీసం పాఠశాలలకు పర్మిషన్ లేకుండానే అడ్మిషన్లు చేస్తున్న కానీ విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. కావున ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలలో ఫీజులను నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి, అనుమతి లేని పాఠశాలలను మూసివేస్తామని ప్రకటన ఇవ్వడం జరిగిందని, దాంతో పాటు అనుమతి లేని పాఠశాలలు ఎన్ని జిల్లాలో ఉన్నాయో బహిర్గతం చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విధ్యార్థి యువజన సంఘాలుగా డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



**ప్రజాపక్షం/తిరుమలగిరి :** ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభ్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 449 పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. చైతన్యవంతులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, నాయకులు లక్ష్మయ్య, పేరాల వీరేష్, దాచేపల్లి వెంకన్న, శాగంటి రాములు, సతీష్ గౌడ్, గిలకత్తుల రాము గౌడ్, రాపాక సోమేష్, సుధాకర్, హీరు నాయక్, కిష్టు నాయక్, యాదగిరి తదితరులు ఉన్నారు.

# బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఖమ్మంలో 67.63 శాతం

భద్రాద్రిలో 70.01 శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా పట్టభద్రుల ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎప్పటి లాగానే అర్బన్ ఓటర్ల కంటే రూరల్ ప్రాంత ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గడిచిన పార్లమెంటు ఎన్నికల కంటే శాసన మండలి ఉప ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద సందడి కనిపించింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అత్యధికంగా ఆళ్లపల్లి మండలంలో 81 శాతం నమోదైంది. ఇక్కడ 239 ఓట్లకు గాను 194 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లాలో మధిరలోని సిపిఎస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 363 బూత్‌లో 77.68 శాతం పోలైంది. ఇక అత్యల్పంగా పెనుబల్లి మండలం లో ఏర్పాటు చేసిన 371వ బూత్‌లో కేవలం 54.71 శాతం పోల్ కాగా తిరుమలాయపాలెం మండలం 389 బూత్‌లో 54.86 శాతం ఓట్లు పోలయ్యాయి. ఖమ్మంజిల్లాలోని ఐదు నియోజక వర్గాలను పరిశీలించినప్పుడు సత్తుపల్లిలో పట్టభద్రుల ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయ్యగారిపేట, జెవిఆర్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో 70 శాతానికి పైబడి ఓటింగ్ జరిగింది. కూసుమంచి మండలంలో 72.64 శాతం ఓటింగ్ నమోదైంది. రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు లేకుండా జరిగినప్పటికీ రాజకీయ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, టిజెఎస్ లు తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇవ్వగా ఏనుగుల రాకేష్‌రెడ్డికి బిఆర్ఎస్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి బిజెపి మద్దతునిచ్చాయి. మొత్తం బరిలో 52మంది అభ్యర్థులు ఉండగా ప్రధానంగా ఈ ముగ్గురి మధ్యనే పోటీ జరిగింది. స్వతంత్ర అభ్యర్థులలో ఒకరిద్దరు మినహా నాలుగు అంకెల ఓట్లను సాధించే వారు కనిపించడం లేదు.

**యధేచ్చగా డబ్బులు పంపిణీ :**

యధేచ్చగా డబ్బుల పంపిణీ జరిగింది. ఓటరుకు రూ. 500ల చొప్పున ఓ అభ్యర్థి మొత్తం 60 శాతం ఓట్లకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఒక ప్రధాన పార్టీ ఈ డబ్బుల పంపిణీ వార్త తెలుసుకుని తాము కూడా పంపిణీ చేసేందుకు పూనుకుంది. కాని కొన్ని చోట్ల రూ. 300, మరికొన్ని చోట్ల రూ.500 పంపిణీ చేసినా పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేకపోయారు. కొన్ని చోట్ల రూ. 500 ఇవ్వలేదని ఫిర్యాదులు చేయడమకెందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించి ఘర్షణను సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయి.

**ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం :**

వరుసగా మూడో ఎన్నిక కూడా ప్రశాంతంగా జరగడంతో ఖమ్మంజిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఖమ్మంజిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ప్రశాంత పోలింగ్ తో పాటు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చేసిన కృషి ఫలించిందని చెప్పవచ్చు. సహజంగా పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉంటుంది. కాని ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం కూడా అధికంగానే నమోదైందని చెప్పవచ్చు. పోలింగ్ కేంద్రాల నుంచి సామాగ్రిని ప్రత్యేక వాహనాల్లో కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తున్నారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు :**

జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ దంపతులు, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, పలువురు వైద్యులు , అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# చిన్న పొరపాటు సైతం జరగొద్దు

ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** వచ్చే నెల నాలుగో తేదీన కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ అనేది చాలా కీలకమైనదని పేర్కొన్నారు. ఇందులో చిన్న చిన్న తప్పిదాలు జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని, లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. పక్కాగా ఓట్లను లెక్కించాలని , ఏదైనా సమస్య వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది ఉదయం 7 గంటల వరకే కౌంటింగ్ హాలుకు చేరుకోవాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. ఈవీఎంలను సరిగా ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలని, కౌంటింగ్ హాలులో వారీగా ఈవీఎంలను సరిచూసుకోవాలని పేర్కొన్నారు. ఏజెంట్లతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు కౌంటింగ్ హాలు నుంచి ఎవరు బయటకు వెళ్లరాదని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈడీసీ, పోస్టల్ బ్యాలెట్ ,ఈవీఎంల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రతి టేపతి వద్ద ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలని, సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపుపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు , తదితరులున్నారు.

## 492 కిలోల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సినీ పక్కీలో తరలిస్తున్న 492 కేజీల గంజాయిను సోమవారం కొత్తగూడెం త్రి టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పట్టుపడ్డ గంజాయి విలువ సుమారు రూ.1 కోటి 23 లక్షలు. వివరాల ప్రకారం పట్టణంలోని పాత డిపో సెంటర్ వద్ద ఎస్సై పురుషోత్తం తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎంహెచ్ 20ఇఎల్ 5732 నెంబర్ గల అశోక్ లైలాండ్ డిసిఎం వాహనంలో ప్రత్యేక అర ఉంచిన గంజాయిని గుర్తించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి ఈ దాడి నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి తరలిస్తూ పట్టుబడిన వారిలో మహారాష్ట్రకు చెందిన శుభమ్ శరత్ బండారి, అంజల్ అబ్దుల్ షేక్ ఉన్నారు. వీరితో పాటు గంజాయిని, వాహనాన్ని స్వాదీనం చేసుకుని నింధితులను రిమాండ్‌కు తరలించారు. సోలాపూర్‌కు చెందిన యోగేష్ అనే వ్యక్తి కొనుగోలు చేసుకుని తీసుకురమ్మన్నట్లు నింధితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిషేదిత గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నింధుతులను చాకచక్యంగా పట్టుకున్న త్రీటౌన్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులను ఎస్పి రోహిత్ రాజ్ అభినందించారు.

## సూర్యాపేట జిల్లాలో 73.15 శాతం పోలింగ్

**ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సూర్యాపేట జిల్లా 73.15 నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అధికారికంగా ప్రకటించారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హూజూర్‌నగర్ డివిజన్‌ల పరిధిలో మొత్తం 51497 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 29 ప్రాంతాల్లో 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పోలింగ్ జరగగా రౌండ్ల వారిగా ఎన్నికల పోలింగ్ వివరాలను అధికారులు వెల్లడించారు. మొదటి రౌండ్‌లో 11.32శాతం పోలింగ్ నమోదు కాగా ఇందులో పురుషులు 4258, మహిళ ఓటర్లు 1570 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే రెండో రౌండ్‌లో 31.27శాతం పోలింగ్ నమోదు కాగా 10813 మంది పురుషులు, 5290 మంది మహిళ ఓటర్లు, మూడో రౌండ్‌లో పురుషులు 17968 మంది, మహిళలు 9220 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 52.80శాతం పోలింగ్ నమోదైంది. నాలుగవ రౌండ్‌లో 70.62శాతం పోలింగ్ నమోదు కాగా 24142 మంది పురుషులు, 12225 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.దీంతో జిల్లా వ్యాప్తంగా పురుషులు 25447, మహిళ ఓటర్లు 12222 మొత్తం 37,669 ఓట్లు పోలయ్యాయి. దీంతో 73.15శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ అనంతరం ఆయా నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల బాక్సులను సంబంధిత ఎఆర్‌ఓల ఆధ్వర్యంలో సెక్టార్ అధికారుల సమక్షంలో పటిష్ట భద్రత నడుమ 16 రూట్ వాహనాల ద్వారా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించారు. అనంతరం నల్లగొండలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు బాక్సులను తరలించి భద్రపరిచారు.

## ఎట్టకేలకు కదిలారు.. ఆహార నిల్వలపై విస్మయం

హోటళ్లను తనిఖీ చేసిన అధికారులు





**ప్రజాపక్షం/ ఖమ్మం :**ఆహార పదార్థాల విక్రయం అతి పెద్ద వ్యాపారంగా మారింది. మారిన జన జీవిత పద్దతుల నేపథ్యంలో ఇంట్లో తయారీ కంటే బయట ఆహార పదార్థాలను స్వీకరించే వారి సంఖ్య పెరుగుతుంది. నిత్యం హోటళ్ల నుంచి టిఫిన్లు సహా ఆహార పదార్థాలను తెచ్చుకుని తినే వారు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. పొయ్యి వెలిగించకుండా ఉండే కుటుంబాల సంఖ్య క్రమేపి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో అన్ని వ్యాపారాల మాదిరే ఆహార వ్యాపారం కూడా లాభాలను కోరుకుంటూ కల్తీ చేస్తున్నారు. నాసిరకం పదార్థాలను వినియోగించడం, మాంసహారాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచడం చేస్తున్నారు. చాలా కాలంగా ఇది జరుగుతున్నా ఆహార తనిఖీ అధికారులు హోటళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆహార పదార్థాల నిల్వలు ఎక్కువగా పెద్ద హోటళ్లలోనే జరుగుతుందన్న ఆరోపణ వినవస్తున్నా కనీస స్పందన కరువైంది. ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడు కూడా లేడు. ఏమి జరిగిందో కాని ఎట్టకేలకు ఆహార పదార్థాల తనిఖీ అధికారులు సోమవారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పలు హోటళ్లపై దాడులు నిర్వహించి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఖమ్మంలోని పలు హోటళ్లలో తనిఖీ చేసిన అధికారులు స్టార్ హోటళ్ల బాగోతాన్ని బయట పెట్టారు. ఖమ్మంలోని స్టార్ హోటళ్లు అనదగిన వాటిలో కొన్నింటిలో మాంసహార పదార్థాలను నిల్వ చేయడంతో వాటికి ఫంగస్ సోకిందని బయట వేయించారు. ఐస్‌క్రీం సైతం బూజు పట్టిన విషయాన్ని అధికారులు కనుగొన్నారు. ఖమ్మంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోను పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి నేతృత్వంలో దాడులు జరిగాయి. భద్రాచలంలోని ఓ హోటల్‌లో సింథటిక్ ఫుడ్ కలర్స్ ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖమ్మంలో కలర్ కోటెడ్, తందూరి చికెన్, నిల్వ ఉంచిన చికెన్, బ్యాచ్ నెంబరు లేని కొబ్బరి పొడి, ఇతర ముడి పదార్థాలను అధికారులు గుర్తించారు. బియ్యం రవ్వ, ఇంకా ఇతర ముడి పదార్థాలు సైతం చాలా కాలం క్రితం నిల్వ ఉంచినట్లు అధికారులు తమ దాడుల్లో తెలుసుకున్నారు. వంట గదులను పరిశీలించి అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు. హోటళ్ల నిర్వహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. భద్రాచలంలో భద్రా గ్రాంట్ టాన్ రెస్టారెంట్‌కు రూ. 10వేల జరిమానా, గౌతమి స్పైస్ రెస్టారెంట్‌కు రూ. 20వేల జరిమానా విధించారు. ఇప్పటికైనా ఆహార పదార్థాల తనిఖీ నిరంతరం చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇక ఇల్లంతా శుచి శుభ్రత అని చెబుతూ బయట ఆహారం తెచ్చుకుని తినే వారు సైతం ఈ పరిస్థితులను గమనించిన తర్వాత ఆలోచన మార్చుకోవాల్సి ఉంటుంది.

## ప్రశాంత వాతావరణంలో...

కలెక్టర్ ఎస్ వెంకట్రావ్

**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్ :** ఓటు హక్కు కలిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌లో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డేతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ అప్పారావు, పిడి మధుసూదన్‌రాజు, డిపిఓ సురేష్ కుమార్, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాస రాజు, తహసీల్దార్ శ్యాసుందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతుల గడ్డివాములు దగ్ధం

**పరిశీలించిన ఎమ్మెల్యే విజయుడు**

**ప్రజాపక్షం / అలంపూర్ :** అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు రాముడు, శ్రీరాముడు వారి గడ్డివాములు సోమవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు బాధిత రైతుల కుటుంబాలను పరామర్శించాడు. గడ్డివాములు కాలిపోయిన స్థలాన్ని పరిశీలించి గడ్డివాములు కాలిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి సాయం చేయడానికి క్రుషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట దామోదర్‌రెడ్డి, తదితరులున్నారు.



## నకిలి పత్తివిత్తనాల ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** నకిలి పత్తి విత్తనాలను రవాణా చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ.5లక్షల విలువైన 260కిలోల నకిలి విత్తనాలను స్వాదీనం చేసుకున్నామని డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు తెలిపారు. సోమవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలి విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు నకిలీలను అరికట్టడంలో భాగంగా ఈనెల 25న ఉదయం 10గంటలకు పట్టణంలోని ఈదులగూడ చౌరస్తాకు వన్‌టౌన్ పోలీసులు వెళ్లగా పోలీసులను చూసి ఒక వ్యక్తి అతని వద్ద ఆరు తెల్లని బస్తాలు వదిలి పారిపోయాడని తెలిపారు. తెల్లబస్తాల్లో ఉన్న వాటి గురించి పరిశీలించేందుకు ఎంఏవోను పిలిపించి నకిలి విత్తనాలు అని నిర్ధారించిన తరువాత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. దర్యాప్తు చేస్తుండగా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద గంధవల్ల శ్రీరంగను పట్టుకోని విచారించగా గునుగుంట్ల వీరమణికంఠ అలియాస్ అయ్యప్ప, ముంద్రు మల్లిఖార్జున్ అలియా అనిల్‌చౌదరి, కోట సాంబశివరావు గురించి వివరించాడన్నారు. వాడపల్లి చెక్‌పోస్టు వద్ద నకిలీ విత్తనాల వ్యాపారులను కలవడానికి వెళ్లనున్నట్లు తెలిపారన్నారు. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకున్నారని వారి నుంచి విత్తనాలను స్వాదీనం చేసుకున్నామని, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఒకడు పరారీలో ఉన్నాడన్నారు. పెండ్యాల జగదీశ్వర్‌రావు నుంచి నకిలి విత్తనాలు కొనుగోలు చేసేవారని తెలిపారు. మల్లిఖార్జున్ అలియాస్ అనిల్‌పై మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో 3, తాండూరులో ఒక కేసు, కోట సాంబశివరావుపై భీమిలీ, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. కేసును ఛేదించి డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు, వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ రవికుమార్, కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, హుస్సేన్, నాగరాజులను ఎస్పీ చందనదీప్తి అభినందించి క్యాష్ రివార్డును ప్రకటించారు.

## సామాన్యురాలిగా క్యూలైన్‌లో నిలబడి..



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల సందర్భంగా సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 195లో సామాన్యురాలిగా క్యూ లైన్‌లో నిలబడి ములుగు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల పోలింగ్ సజావుగా జరుగుతున్నదని, ఓటు హక్కును తాను బాధ్యతగా వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## పోలింగ్ సరళి పరిశీలన



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ పోలింగ్ కేంద్రంలో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అక్కడ పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే పలు సూచనలు చేశారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్త్ నడుమ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ ముగిసిందన్నారు.

## విత్తన కొనుగోళ్లపై అవగాహన



**ప్రజాపక్షం / అయిజ :** మండల పరిధిలోని ఉత్తనూరు గ్రామంలో పంచాయతి కార్యాలయం దగ్గర వ్యవసాయ విస్తరణ అధికారి లోకరాజు విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు కేవలం లైసెన్స్ కలిగిన షాపుల్లోనే నాణ్యమైన విత్తనాలు కొనాలని అలాగే రసీదు పొందాలని సూచించారు.ముఖ్యంగా ఎవరి దగ్గర పడితే వారి దగ్గర లూజు విత్తనాలు కొనరాదని తెలిపారు. ఇలాంటివి రైతులు దృష్టికి వస్తే వ్యవసాయ అధికారులకు తెలపాలని అన్నారు.గ్రామ రైతుల జయన్న, బజారి, ఏసన్న, వీరేష్, శ్రీను యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నిక సందర్భంగా వరంగల్‌లోని పలు పోలింగ్‌కేంద్రాలను వరంగల్ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య సోమవారం సందర్శించారు. వరంగల్ ఎల్బీ కాలేజీ, ఏవి కాలేజీలో ఏర్పాటుచేసిన ఆరు పోలింగ్ కేంద్రాలలో కల్పించిన వసతులను, ఓటర్ల సరళి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల గురించి అధికారులను, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## ఉత్సాహం చూపని మహిళా పట్టభద్రులు



**ప్రజాపక్షం/గణపురం:**గణపురం మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. జడ్పీఎస్ఎస్ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని భూపాలపల్లి డిఎస్‌పి సంపత్ రావు పరిశీలించారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 1781 ఉండగా 1325 మంది పట్టభద్రులు ఓట్లు వేశారు. 17 గ్రామ పంచాయతీలలో పురుష పట్టభద్రులు 883 ఉండగా మహిళలు 898 మంది పట్టభద్రులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా పట్టభద్రులు ఓట్లు వేసేందుకు ముందుకు రాలేకపోయారు. 839 మంది పురుష పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోగా 486 మంది మహిళా పట్ట భద్రులు ఓట్లు వేశారు. జెన్కో సి ఇ సిద్దయ్య ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటేసిన ప్రముఖులు



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గంలో పలువురు నాయకులు, అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నెంబర్ 213లో పట్టభద్రుల ఓటు హక్కును జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రులఎమ్మెల్సీఉపఎన్నికల్లో జి ఎమ్ ఆర్ఎమ్ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ, బిఆర్ఎస్‌పార్టీయువ నాయకులు గండ్ర గౌతమ్‌రెడ్డి, సతీమణి వైశాలిని, భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, గండ్ర యువసేన నాయకులు శ్రీకాంత్ పటేల్ ఓటేశారు. భూపాలపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాద రఘునాథ్‌రెడ్డి దంపతులుఓటు వేశారు.



## ఓటేసిన సృజన్‌కాంత్



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :**ఎమ్మెల్సీఎన్నికల్లో భాగం గా వరంగల్ ఎల్‌బి కళాశాలలో స్థానిక యువజన అధ్యక్షులు గోపిదు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సృజన్‌కాంత్ సోమవారం కుటుంబ సమేతంగా ఓటేశారు.కార్తీక్ సింగ్, నాగేంద్ర బాబు,నాయకులు గోల్కొండ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘హన్మకొండ’లో ఓటెత్తిన గ్రాడ్యుయేట్లు

### ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 72.16 శాతం పోలింగ్ నమోదు
### జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు





**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 72.16 శాతం పోలింగ్ నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి.జిల్లాలో ఉదయం 8 గంటలకు ప్రారంభ, అయిన ఉప ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఈ ఉప ఎన్నికలో పట్ట బద్రులు తమ ఓటు హక్కును ఆయా పోలింగ్ కేంద్రాలలో వినియోగించుకున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ , ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సజావుగా పోలింగ్ జరిగేలా భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ అనంతరం సిబ్బంది బందోబస్తు మద్య బ్యాలెట్ బాక్సులను, ఇతర ఎన్నికల సామాగ్రిని హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిసెప్షన్ కేంద్రానికి తెచ్చారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించడంలో తగిన కృషి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## భారీ భద్రత మధ్య..



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కి జరుగుతున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ సోమవారం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ తో పాటు మట్టేవాడ, హనుమకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇస్లామియా కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ బందోబస్తూ తో పాటు పోలింగ్ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్థానిక పోలీస్ అధికారులతోపాటు, పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకున్నారు.

## మందకొడిగా ప్రారంభమై..పుంజుకున్న పోలింగ్

### 69.52 శాతం పోలింగ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజవర్గం ఉప ఎన్నికలు సోమవారం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లాలోని ఏర్పాటు చేసిన 36 పోలింగు కేంద్రాల్లోనూ గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగు ప్రక్రియ మొదట మందగోడిగా మొదలై ఆ తర్వాత జోరందుకుంది. మొదటి సెషన్‌లో 15 నిమిషాల్లోనే తమ ఓటు హక్కు వినియోగించుకుని ఓటర్లు బయటకు రాగా ఆ తర్వాత గంటకు పైగా క్యూ లైన్లో నిలుచోవాల్సి వచ్చింది. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మానుకోట పట్టణంలోని పోలింగు కేంద్రాలను పరిశీలించడంతో పాటు రోడ్లపై కూడా ఆయన బందోబస్తునున పర్యవేక్షించారు.దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బంది ద్వారా వారికి పోలింగు బూతుల్లోకి తీసుకెళ్లి వారిచేత ఓటు వేయించారు.

**జోరుగా ప్రచారాలు..**

పోలింగు కేంద్రాల వద్ద కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను తమ అభ్యర్థికే ఓట్లు వేయాలంటూ ప్రాదేయపడ్డారు. పోటాపోటీగా ఆయా పార్టీల శ్రేణులు ప్రచారాలు చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి తరుపున మద్దతు పలికిన సిపిఐ, సిపిఎం, టీజేఎస్ నాయకులు, పార్టీ క్యాడర్ పాల్గొని ప్రచారం చేశారు. బీఎల్ఓలు పోల్ చిట్టీలు అందించకపోవడంతోపాటు పోలింగు కేంద్రాల వద్ద కూడా వారి జాడ కనిపించకపోవడంతో ఏ పోలింగు బూతులో తమ ఓటు ఉందో అనే విషయంలో కొంతమంది ఓటర్లు తికమక పడ్డారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో పోలింగు జరిగిన సోమవారం సాయంత్రం 4 గంటల వరకు 69052 శాతం పోలింగు నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్‌సింగ్‌ప్రకటించారు. ఈ సమయానికి 15,850 మంది పురుషులు, 8,435మంది మహిళలు మొత్తంగా 24,285 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆయన వెల్లడించారు.

## భూపాలపల్లిలో 69.61 శాతం

### 8,669 మంది ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి పతినిధి :** అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భూపాలపల్లి నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఘన్పూర్, చిట్యాల జడ్.పి. హెచ్.ఎస్ పాఠశాలలో జరుగుతున్న ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టబద్రుల శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని 12535 మం ది ఓటర్లకు గాను 8 ,669 పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 69.16శాతం పోలింగ్ నమోదు అయినట్లు పేర్కొన్నారు. అందులో 5,446 పురుషులు,3,223 మహిళ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో నంబర్లు వేయాల్సి ఉన్నదని అన్నారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించు కుంటున్నారని తెలిపారు.

# దామెరలో ఇబ్బందిపడ్డ ఓటర్లు



**ప్రజాపక్షం/దామెర/ఆత్మకూరు:** మండల కేంద్రంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ బూత్ ఒక్కటే ఏర్పాటు చేయడంలో ఓటర్లు గంటల తరబడి నిలబడలేక ఇబ్బందులకు గురయ్యారు. ఎలాంటి గొడవలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయనతోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

మండల కేంద్రంలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మండలాధ్యక్షుడు కమలాపురం రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ జనగాం రాజు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మాదాసి శ్రీధర్, అర్షం బాలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా 144 సెక్షన్ విధించారు.

## నకిలీ విత్తనాలతో జాగ్రత్త!



**ప్రజాపక్షం/శివ్వంపేట :** రైతన్నలు విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య అన్నారు. మండలంలోని రూప్లతండా, కొత్తపేట, సికింద్లాపూర్, బిజిలిపూర్, దొంతి సోమవారం విత్తనాల కొనుగోలులో పాటించాల్సిన జాగ్రతలపై అన్నదాతలకు అవగాహనానిర్వహించారు. ఎఓ లావణ్య మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి తద్వారా పంట దిగుబడిని అధికంగా పొందవచ్చని సూచించారు. సబ్సిడీపై వరి విత్తనాలు కూడ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాల అమ్మకాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహారిస్తోందని, చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# ‘సిద్దిపేట’లో 3542మంది ఓటేశారు

### సిద్దిపేట జిల్లాలో 76.13 శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** నల్గొండ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నిక సిద్దిపేట జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిధిలోని కొమురవెల్లి, చేర్యాల, మద్దురు, దూలిమిట్ట పరిధిలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలో చేర్యాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 4679 ఓటర్లు ఉండగా పురుషులు 3122, మహిళలు 1557 మంది ఉన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికకు జిల్లాలోని ఐదు మండలాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 4679మంది ఓటర్లకు 3542 మం ది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోగా 76.13 శాతం ఓటింగ్ నమోదైంది. వీరిలో 2353 పురుషులు, 1209 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని నాలుగుమండలాల్లో చేర్యాలమొదటిపోలింగ్‌బూత్‌లో 71.62 శాతం,రెండవ బూత్‌లో 71.94 శాతం ఓటింగ్ నమోదైంది. కొమురవెల్లిలో86.58శాతం,మద్దూరులో78.40 శాత ం, దూల్‌మిట్టలో 79.84 శాతం నమోదైంది. అత్యధికంగా కొమురవెల్లిలోమండలంలోఅత్యల్పంగాచేర్యాలలోనమోదైంది.

**పోలింగ్ సరళి పరిశీలన**

నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నిక సందర్భంగా జిల్లాలోని కొమురవెల్లి, చేర్యాల మండలాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించటంతో పాటు పోలింగ్ సరలిని పరిశీలించారు. మనుచౌదరి మాట్లాడారు.

**దూల్‌మిట్ట,చేర్యాలలో..**

సిద్దిపేట పోలిస్ కమిషనర్ అనురాధ చేర్యాల, దూల్‌మిట్ట పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్‌సరళిని పరిశీలించారు. హుస్నాబాద్ ఏసిపి సతీష్, చేర్యాల సిఐ శ్రీనివాస్,సిఐలు కిరణ్, శ్రీధర్‌గౌడ్ తదితరుల పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/రామాయంపేట:**విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని దామరచెరువులో పర్యటించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మంచిగా చదువుకునేందుకు అనువుగా సౌకర్యాల కల్పనకు మరమ్మత్తులు చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న హరితహారంలో పండ్ల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అంతకు ముందు మండంలోని రాయిలాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రజినికుమారి, విద్యాదికారి నీలకంఠం, ఏవో రాజ్‌నారాయణ, ఆర్ఐ రాజు, సొసైటీ సీఈవో పుట్టి నర్సింలుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాపై అవాస్తవాలు తగవు

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధిః** సంగారెడ్డి పట్టణంలో మూడు రోజుల నుండి నీటి సరఫరా నిలిచిపోయిదనడంలో వాస్తవం లేదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డిపట్టణానికిఅంగడిపేట నుండి మంజీరా ఇంటికి 600 మీటర్ల వ్యాసం గల పైప్ లైన్ ద్వారా నిరంతరం నీటి సరఫరా జరుగుతుందని ఈ పైప్ లైన్ శనివారం రాత్రి బ్రెక్ కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే ఆదివారం మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి మున్సిపల్ పట్టణంలోని 1,2,3,5,18,22 ఆరు వార్డులలో ఆదివారం ఉదయం మాత్రమే నీటి సరఫరా జరగలేదని అదనపు కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న మూడు రోజులుగా నీటి సరఫరా బంద్ అనే వార్త అవాస్తమన్నారు. ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంగడిపేట మంజీరా పైప్ లైన్ పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంగారెడ్డి పట్టణ మున్సిపల్ కమీషనర్ సిబ్బందితో కలిసి పైప్ లైన్ పనులను పరిశీలించారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరా తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పట్టణంలో 05 వార్డు కాలనీలో నీటి సరపరా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఎన్నికల సంఘం తీరుపై చర్చోపచర్చలు




**ప్రజాపక్షం/నెక్కొండః** సోమవారం వరంగల్ నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో ఎంఎల్‌సి ఉప ఎన్నికలలో ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికల బూత్‌లో ఒక బ్యానర్‌ను ప్రదర్శించారు. అందులో పోటీ చేసే అభ్యర్థులు మీకు ఎవరు నచ్చకపోతే నోట్లపైన ఓటు వేయాలని పెట్టారు. కానీ బ్యాలెట్ పత్రంలో నోటాకు స్థలం కేటాయించకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు ఇష్టం లేని వారు నోటాపైన ఓటు వేసే హక్కును అవకాశాన్ని కోల్పోయారు. ఈ తప్పిదం ఎన్నికల సంఘందో ఎవరిదో అర్థం కాక పట్టభద్రులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం, (రాష్ట్ర ఎన్నికల సంఘం) ఇంత నిర్లక్ష్యంగా పలువురు ఎన్నికల సంఘ విధానాన్ని ఎండగట్టారు. ఈ ఎంఎల్‌సి పోటీలో 52 మంది అభ్యర్థులు పోటీ చేయడం విశేషం.

# కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

### కలెక్టర్‌కు వినతిపత్రం



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్‌లో 144 సర్వే నెంబర్ లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను గ్రామస్తులు కూల్చి వేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో ఖరీజ్ ఖాతాలో ఉన్న 11ఎకరాల42 గుంటల భూమిని గతంలో గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులంతా కలిసి గ్రామ అభివృద్ధి కొరకు వినియోగించుకోవాలని తీర్మానించారు. మనోహరాబాద్ మండల్ ఇండస్ట్రియల్ ఏరియా కావడంతో భూములకు ధరలు పెరిగి కోట్ల రూపాయలు పలుకుతుంది. ఇదే అదునుగా చూసి కొంతమంది అధికార పార్టీ నాయకుల మద్దతుతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలోకి వచ్చి సోమవారం అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఇది గమనించిన గ్రామస్తులు, మహిళలు ఆందోళనచేపట్టి, అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను కూల్చివేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది.అనంతరంగ్రామస్తులు మనోహరాబాద్ తహసిల్దార్, మెదక్ జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు.గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కొమరం భీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే భారత ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. సోమవారం న్యూఢిల్లీ నుండి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇతర సంయుక్త కమిషనర్లు అన్ని జిల్లాల కలెక్టర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గల సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజక వర్గాల కౌంటింగ్ ఆదిలాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. కౌంటింగు హాలులో ఓట్లు లెక్కింపు కోసం టేసం ఏర్పాటు, పోస్టల్ బ్యాలట్ కౌంటింగ్ కొరకు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రౌండ్ల వారీగా సమాచారాన్ని డిస్ప్లే బోర్డుపై ప్రకటించడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణులతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఆదివారం బోథ్ సిఐ రమేష్, ఎస్ఐ బి.రాము విత్తనాలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా షాపులలోని రికార్డులను స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విత్తన దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు విక్రయించాలని అన్నారు. బ్లాకులో విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు. మండల కేంద్రంలోని మదుకర్ సీడ్స్ ఫర్టిలైజర్ విత్తన దుకాణాన్ని తనిఖీ చేశారు.

## క్రీడాకారులకు నగదు పురస్కారాలు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** వార్షిక క్రీడలలో కోల్ ఇండియా, ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్‌లలో మెడల్స్ సాధించిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులకు యాజమాన్యం అందించే నగదు బహుమతులను ఏరియా జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డి అందించారు. సోమవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో వారిని జిఎం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు క్రీడలలో వారి ప్రతిభను కోల్ ఇండియా, ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్‌లో ప్రదర్శించడం సంతోషకరమన్నారు. అలాగే ఉద్యోగులు భవిష్యత్తులో కూడా క్రీడలలో మరిన్ని మెడల్స్ సాధించాలని కోరారు. వివిధ క్రీడలలో బహుమతులు పొందిన క్రీడాకారులు తమ తోటి ఉద్యోగులకు కూడా క్రీడలలో శిక్షణ ఇవ్వాలని కోరారు. ఎస్ఓటు జిఎం వి. పురుషోత్తమ రెడ్డి, ఎజిఎం ఫైనాన్స్ మురళీధర్, డిజిఎం పర్సనల్ పి. అరవిందరావు, ఏఐటియుసి నాయకులు మోత్కూరి కొమరయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, చాట్ల అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసమే 'షీ'టీమ్‌లు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మహిళలకు రక్షణ కల్పించడం కోసం షీ టీంలు పని చేస్తున్నాయని షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న పేర్కొన్నారు. జిల్లా ఎస్పి సురేష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీటీం ను సంప్రదించాలని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో దయల్ 100కు కాల్ చేయాలని, షీ టీం ఆసిఫాబాద్ 8712670564 కు సంప్రదించాలని సూచించారు. సిబ్బంది ఎం. ప్రకాష్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

### ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం / ధర్మపురి :** ఫర్టిలైజర్స్ దుకాణాలతో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ రాం నర్సింహారెడ్డి హెచ్చరించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం సిఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్ కుమార్, మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్‌లు ధర్మపురి పట్టణంలోని విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.దుకాణాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, స్టాక్ రికార్డులను, బిల్ రికార్డులను పరిశీలించారు. సిఐ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విత్తనాలు, మందు బస్తాలు, పురుగుల మందులు తదితర వాటిని అమ్మినట్లయితే లైసెన్సులు రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో రైతులను మోసం చేయడానికి తక్కువ ధరలకు పత్తి విత్తనాలంటూ నకిలీ విత్తనాలు అంటగడుతూ మోసం చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండి అటువంటి వారు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని తెలిపారు. గతంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులెందరో ఉన్నారని, మళ్లీ జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గల నాణ్యమైన విత్తనాలు, మందులను విక్రయించాలని సూచించారు.

**రైతులకు అవగాహన**

నకిలీ విత్తనాల బారిన పడి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని రాయపట్నం, తిమ్మాపూర్, నేరేళ్ల, దొంతాపూర్ గ్రామాలలో వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ ఆధ్వర్యంలో ఏఈవోలు పర్యటించారు.

# ప్రజల ప్రాణాలకు ముప్పు

### ఖని మెడికల్ కళాల కాంట్రాక్టర్‌పై చర్యలకుడిహెచ్‌పిఎస్‌డిమాండ్



**ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరిఖని మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌పైచర్యలు తీసుకోవాలని డిహెచ్‌పిఎస్ నాయకులు డిమాండు చేశారు. నిర్మాణం చేస్తున్న ప్రాంతంలోభద్రత,రక్షణచేపట్టకుండా ప్రజల ప్రాణాలు పోయే విధంగా చలగాటం మాడుతున్నారని పెద్దపల్లి జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి (ఏఎల్ఓ) రామ్మోహన్‌కు డిహెచ్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజారత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేష్, రామగుండం నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, జిల్లా నాయకులు బొద్దుల రమేష్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మద్దెలదినేష్,రాజారత్నం మాట్లాడుతూ నియంతలాగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వకుండా శ్రమదోపిడి చేస్తూఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బుధవారం రావుల విజయ్ జనరల్ ఆస్పత్రి ముందు నూతన బిల్డింగ్ నిర్మిస్తున్న మెడికల్ కళాశాల కాంట్రాక్టర్ పనులుచేయిస్తుండగా రావుల విజయ్ పెద్ద గోతిలో పడి మృతి చెందితే, సంబంధం లేదని కంట్రాక్టర్ చెప్పడం విచారకరమన్నారు. విజయ్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి విజయ్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ అధికారి రామ్మోహన్‌ను కోరారు. ఆయన స్పందించి విచారణ చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులకు నకిలీ, కల్తీ విత్తనాల, నిషేధిత హెచ్ టి కాటన్ విత్తనాలను తనిఖీలలో గుర్తించడం కోసం పాటించే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌పై రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి పోలీస్ అధికారులకు వివరించడం జరిగింది.సిపి మాట్లాడుతూవిత్తన డీలర్లు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసిన, దుకాణాలలో, ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించిన ,ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం విత్తనాలు అమ్మిన, నకిలీ విత్తనాలు అమ్మిన, నిల్వచేసిన రవాణా చేసిన, నకిలీ దందా చేస్తున్నట్లు తెలిసిన తీవ్రమైన కేసులు నమోదు చర్యలు తీసుకోవాలి. విత్తనాల ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించాలి అధికారులకు తెలిపారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, సిసిఆర్బీ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, కమీషనరేట్ పరిధిలోని సీఐ, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలి



* ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ కరీంనగర్‌ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి
* బుగ్గారం ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం
* ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్.

**ప్రజాపక్షం / బుగ్గారం :** పాత్రికేయులు ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా పని చేయాలని ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని అన్నారు. కార్యాలయ ప్రారంభానికి ముఖ్య అతిథిగా తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథి హాజరైన వేముల సుభాష్ మాట్లాడుతూ పత్రికలలో చిన్న పెద్ద అనేది ముఖ్యం కాదు వార్త ఎంత నిజాయితీగా ఉంది, ఎంత ఉపయోగకరంగా ఉందనేది ముఖ్యమన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జీవన్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు కొరకు సహకరించిన ప్రజాప్రతినిధులకు తోటి జర్నలిస్టు మిత్రులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో జర్నలిస్టులు ఉండాలనే ఉద్దేశంతో కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. పత్రికలు నిజాలను వాస్తవాలను ప్రజల సమస్యలను రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ బుగ్గారం కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్, భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు గాలిపల్లి మహేష్, మాజీ సర్పంచ్ సుద్దాల శరత్ చందర్, శ్రీ గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపల్ నక్క రాజు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## బాధితులకు సత్వర న్యాయం



### జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్

### 24 ఫిర్యాదులు స్వీకరణ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్‌పి తెలిపారు. ఎస్‌పి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగాపరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్‌పి తెలిపారు.

## క్రిమినల్ చట్టంపై అవగాహన తప్పనిసరి

### అదనపు ఎస్పీ వినోద్‌కుమార్

**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** వచ్చే జులై నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కొత్త చట్టాలపై అవగాహన , శిక్షణ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమన్నారు. 2023లో చేసిన ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయని తెలిపారు. అందులో బాగంగా వీటి గురించి జిల్లాలోని పోలీసు అదికారులకు , సిబ్బందికి శిక్షణ కార్యక్రమని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్ధవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందన్నారు. క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం , చుట్టూ జరుగుతున్న నేరాల గురించి అదనపు ఎస్పీ వినోద్ కుమార్ క్లుప్తంగా వివరించారు. కొత్త చట్టాల వర్తింపు, నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిఎస్పీ నుండి కానిస్టేబుల్ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు. సమన్వయంతోనే సత్ఫలితాలు చేకూరుతాయన్నారు.

# నూతన విధానాలతో కేసు దర్యాప్తు

### పోలీస్ కమిషనర్ శ్రీనివాస్





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని రామగుండం కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి) అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు 2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. దానిలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించేలా రామగుండం పోలీస్ కమీషనరేట్ లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని రామగుండం కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి) తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి. ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీ షీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయ డంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారు అన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయా లని చేయాల్సి ఉంటుందని సీపీ సూచించారు. నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సీపీ తెలిపారు.అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్,సిసిఆర్బీ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి ఉన్నారు.

## సకాలంలో ఏకరూప దుస్తులివ్వండి

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి:** వచ్చే విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడలో విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024/25 విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలన్నారు. ఆర్థికంగా చేయూత అందించే ఉద్దేశంతోఏకరూప దుస్తులను స్వయం సహాయక సంఘాల మహిళలతోనే కుట్టించడానికి అవకాశం కల్పించామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** వచ్చే నెల నాలుగో తేదీన జరిగే లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సోమావారం అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని,ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును అదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు అమర్చడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణలు నిర్వహించడం జరిగిందన్నారు.

## చట్టంలో మార్పులపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు 2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. దానిలో భాగంగా జిల్లా పరిధిలోని అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించేలా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శిక్షణ ప్రారంభ కార్యక్రమలో ఎస్పీ గారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి. ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి. స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి. నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి. తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారు అన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు *భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలతో శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. ఇంత కాలం పాటిస్తున్న పాత విధానాలలో నూతన ధి చట్టాలకు విరుద్ధమైన వాటినిపాటించకూడదని, నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని సూచించారు.

# పొరపాటు జరగకుండా జాగ్రత్త

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్






**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని జిల్లాఎన్నికలఅధికారి,కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా అధికారులకు,సిబ్బందికి నిర్వహించిన అవగాహన, శిక్షణలో ఆయన మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నిర్మల్ జిల్లా ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ అధికారులు జున్ 4వ తేదీన ఉదయం 5.30 నిమిషాలకు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు.ఎన్నికల సంఘం సిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు.ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని,సమయానికి కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని,అనంతరం ఈవీఎం లలో నమోదైన ఓట్లను లెక్కించాలని ఆదేశించారు.రౌండ్ల వారిగా లెక్కించిన ఓట్ల వివరాలను తెలిపేందుకు స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత ఏఆర్వోలకు సమాచారం అందించాలని,రౌండ్ల వారిగా లెక్కింపు పూర్తికాగానే సంబంధిత ఫారాలు అన్ని జాగ్రత్తగా నింపాలని సూచించారు.మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసరెడ్డి,శ్రీనివాస్ లు సిబ్బందికి ఓట్ల లెక్కింపు సరళిని,తీసుకోవాల్సిన జాగ్రత్తలను తదితర అంశాల పై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో నిర్మల్,అదిలాబాద్ అదనపు కలెక్టర్లు, కిషోర్‌కుమార్, శ్యామలా దేవి, నిర్మల్, భైంసా, ఉట్నూరు ఆర్డీవోలు రత్న కళ్యాణి కోమల్ రెడ్డి, జీవాకర్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

**MOHAMMED RAHEEM** R/o H.No.2-37/1,Eddulagattepalli (V), Manakondur (M), Karimnagar Dist, do hereby state that, I Have Changed my Minor daughter Name From **ZEENATH UNNISA** D/o MAHAMMAD RAHEEM to **ZOHA BUTOOL** D/o MOHAMMED RAHEEM as in Birth certificate with Regn number 1092 dt.30/08/2008, Karimnagar dist.

**CHANGE OF NAME**

**VEDANTHAM LAXMI** R/o H.No. 11-3-455/1, New Ashoknagar, Parsigutta, Secundrabad, Hyd Dist, do hereby state that, I Have Changed my Minor daughter Name From **T.SAHITHI** to **SAHITHI SUNDAR RAJAN** in all Certificates.



## నెహ్రూకు సిఎం, ప్రముఖుల నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎఐసిసి సెక్రటరీ ఎస్‌ఎ సంపత్‌కుమార్, ఎంఎల్‌ఎ శ్రీహరి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు

శేరిలింగంపల్లి ఎంఆర్‌ఒకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించి ఆదుకోవాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సోమవారం శేరిలింగంపల్లి ఎంఆర్‌ఓకు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలు చాలీచాలని వేతనాలతో ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలకు చదువులు చదివించలేక ఇబ్బందులకు గురౌతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో అర్హత కలిగిన అర్హులైన పేదలను గుర్తించి వారి ఫోటో, ఆధార్ కార్డు జాబితాతో కూడిన 1500 మంది జాబితాను ఇవ్వడం జరిగిందని, జాబితాపై ఎటువంటి స్పందన లేదని, ఇప్పటికైన అధికారులు స్పందించి పేదలకు ఇళ్ళ స్థలాలు అందించాలని కోరారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కాసిం, జట్టి శ్రీనివాస్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కొండల్, వెంకటేష్, నారాయణ, కృష్ణ, చంద్రమ్మ, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాకు పూర్తిస్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించండి

ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాకు పూర్తిస్తాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేరని, పక్క జిల్లా నుంచి అధికారులు వచ్చి తనిఖీలు చేయాల్సిన దుస్థితి నెలకొనడం సిగ్గుచేటని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం వల్ల హోటల్, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా ఇష్టానురీతిలో కుళ్లిపోయిని ఆహార పదార్థాలను వాడుతూ ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ నగరంలో వందలాది హోటల్స్, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అనతి కాలంలో వెలిశాయని, వాటిల్లో కల్తీ మాంసం, కల్తీ నూనె, అల్లం వెల్లుల్లి, నాసిరకం వస్తువులను వాడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. ఫిర్యాదులు చేస్తే కనీసం స్పందించే అధికారి లేకపోవడంతో హోటళ్ల నిర్వాహకులు విచ్చలవిడిగా వారికి తోచినట్లు ఆహార పదార్థాలను తయారు చేస్తూ ప్రజలను అనారోగ్యపాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల శ్వేత హోటల్‌లో తూతూమంత్రంగా తనిఖీలు చేశారని, కల్తీ పదార్థాలు దొరికిన కనీసం హోటల్ సీజ్ చేయాలేదని, నోటీసులతో అధికారులు చేయి దులుపుకోవడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్తీ ఆహార పదార్థాలు వినియోగించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం అడుతున్న హోటళ్ల నిర్వాహకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో కల్తీ ఆహార పదార్థాలు వినియోగించరన్నారు. ప్రజారోగ్యంపై దృష్టి సారించి నిత్యం తనిఖీలు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

## సిపిఐ నాయకులు రాములు మృతి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ రాములు అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన మృతిపట్ల సిపిఐ, సిపిఐఎం పార్టీలతో పాటు ఇతర పార్టీల నాయకులు, గ్రామస్తులు, అభిమానులు రాములు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామంలోనే రాములు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవలనే ముదిగొండ రాములును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.

### పార్టీకి తీరనిలోటు : గోదా శ్రీరాములు

ముదిగొండ రాములు మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో ముదిగొండ రాములు మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన నివాసం సమీపంలో సంతాపసభ ఏశాల అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో రాములు ముందుండే వారన్నారు. బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం విషయంలో ప్రజలకు నష్టపరిహారం వచ్చేవరకు పార్టీ నిర్వహించిన పోరాటంలో చురుకైనపాత్ర పోషించార న్నారు, పాలసంఘం డైరెక్టర్, రజక సంఘం జిల్లా జేఏసీ చైర్మన్‌గా పనిచేశారని, చాకలి ఐలమ్మ పోరాటాలను ప్రచారం చేశారన్నారు. ముదిగొండ రాములు పెదనాన్న ముదిగొండ జమ్మయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో ఆరుట్ల కమలాదేవి నాయకత్వన పనిచేశారన్నారు. అతడి వారసత్వాన్ని రాములు పునికి పుచ్చుకున్నారన్నారు. రాములుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. బొలగాని సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి, కళ్లెం కృష్ణ, చెక్క వెంకటేష్, సుదర్శన్, ముత్యాలు, ఇమ్రాన్, బాబు, శ్రీధర్, సోమన సబిత, హేమలత, అభిలాష్, శాంతికుమార్, పుట్ట రమేష్, చింతల మల్లేశం, చింతల పెంటయ్య, ఉడత రాఘవులు, చిక్క బిక్షపతి, రాసాల పెంటయ్య, నోముల ఐలయ్య తదితరులు రాములు మృతదేహానికి నివాళులర్పించారు.

# ప్రధాని స్థాయిని దిగజార్చిన మోదీ



చైనా దురాక్రమణపై మౌనం దేనికి సంకేతం ?

బిలియనీర్లకు రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్ట్‌లు కేటాయించి దేశం పరువు తీశారు

పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి బిజెపి మూల్యం చెల్లించకతప్పదు

అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాం

పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల వేళ గత పదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు చెప్పుకోవాల్సిన ప్రధాని మోదీ మతం, మంగళసూత్రం, ముజ్రా వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆయన ప్రధాని పదవి స్థాయిని దిగజార్చారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా విమర్శించారు. సోమవారం పంజాబ్ రాష్ట్రం ఫరీద్‌కోట్ లోక్‌సభ పరిధిలోని కోటక్‌పుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మోదీ భారత సైనికులను కార్మికులుగా మార్చి రెండు రకాల అమరవీరులను సృష్టించారని విమర్శించారు. అమరవీరుల హోదా, పెన్షన్‌తో పాటు అన్ని సౌకర్యాలు పొందే వారు ఒకరైతే, పేద కుటుంబాల యువతకు మాత్రం ఎలాంటి గౌరవాలు, సౌకర్యాలు లేకుండా వివాదాస్పద పథకాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అగ్నివీర్ పథకం సైన్యం ఆలోచన కాదని, ఇది మోదీ కుట్రపూరిత పథకమని విమర్శించారు. ప్రభుత్వాన్ని బిలియనీర్‌లు అయిన అదాని, అంబానీలు నడుపుతున్నారని, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు ప్రధాని అదానీ గ్రూపులకు విక్రయించి మోదీ తన పరువు పోగొట్టుకున్నారని, ఈ దేశం పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పెరిగిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి పరిస్థితులకు బిజెపి తగిన మూల్యం చెల్లించుకుంటుందని డిప్యూటీ సిఎం అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది, యువతకు తీరని నష్టం వాటిల్లుతోంది, బిజెపి పాలనలో ద్రవ్యోల్బణం, అవినీతి, అస్థిరతతో ప్రజలు విసిగిపోయారు ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఒక పెద్ద మార్పు తీసుకురాబోతున్నారని తెలిపారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణ చూసి మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఆ క్రమంలో విపక్షాలపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పాకిస్తాన్‌తో పోరాడి బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం తెచ్చిపెట్టామని, చైనా మన భూమిని ఆక్రమించి ఇల్లు, రోడ్లు నిర్మిస్తున్నా ప్రధాని మోదీ మౌనంగా ఉండడం దేనికి సూచిక అని ప్రశ్నించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయిస్తామన్నారు. అలాగే రైతులకు రుణ మాఫీ చేయిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

## విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త వహించండి

జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** ఖరీఫ్ పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన కొనుగోలులో జాగ్రత్త వహించాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, విశ్వనాథకాలనీ, మాణిక్యాపూర్, వంగర, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి, మల్లారం, రసూల్‌పల్లి, వీర్లగడ్డ తండా గ్రామాలలో విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వదులు, తెల్ల గుడ్డ సంచులలో ఉన్న విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని రైతులకు తెలిపారు. తప్పనిసరిగా సీల్డ్ ప్యాకెట్లలో ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. రశీదు, విత్తనాల ప్యాకెట్ పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. గుర్తింపు పొందిన అధికృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒ ప్రశాంత్, నాగరాజు, క్రిసోలైట్, ఆషాదీప్, కమల్ హసన్, ఎటిఎం బిందు, పంచాయితీ కార్యదర్శులు సంపత్, వినయ్, వెంకటేష్, శ్రీనాథ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, సదానందం, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆర్థికనిర్మాతగా నెహ్రూదీ చెరగని ముద్ర

వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మాజీ ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, నగరకాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఆర్థిక నిర్మాతగా దేశ మొట్టమొదటి ప్రధానిగా నెహ్రూ చెరగని ముద్ర వేశారన్నారు. ఆర్థిక పంచవర్ష ప్రణాళికలను రూపొందించి ఆర్థికసంక్షోభం నుంచి ఈదేశాన్ని రక్షించారన్నారు. తన ముందు చూపుతో దేశంలో భారీ సాగునీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించి, హరితవిప్లవాన్ని సృష్టించిన మహనీయుడు నెహ్రూ అని కొనియాడారు. వారుచూపిన మార్గాన్ని అనుసరిస్తూ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు అభివృద్ధిలో భాగస్వాములుకాగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ఆయన ఆశయసాధనకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పులి ఆంజనేయులు, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, ఎలగందుల మల్లేశం, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, కల్వల రామచందర్, గుండాటి శ్రీనివాస్, కుర్ర పోచయ్య, రాజిరెడ్డి, సలీమొద్దీన్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండోలో 'యాదాద్రి' క్రీడాకారుల ప్రతిభ



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో క్రీడలలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను చాటినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మీసాల పరమేశం తెలిపారు. మాస్టర్ రాధ, జిల్లా సెక్రటరి మాస్టర్ గుర్రం కృష్ణ, టి మల్లేశం, ఏర్పుల శివ ప్రసాద్‌ను సినియర్ క్రీడాకారులు తల్లితండ్రులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

## నృత్య పోటీల్లో జగిత్యాల విద్యార్థినులకు అవార్డులు

అభినందించిన జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా



**ప్రజాపక్షం /జగిత్యాల ప్రతినిధి :** 2024 కళానిలయం జాతీయస్థాయి నృత్య పోటీలు ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగాయి. ఈ నృత్య పోటీలలో జగిత్యాల పట్టణ శ్రీ మేదిని లలిత కళాక్షేత్రం గురువులు భుజంగరావు, నాట్యసామ్రాట్ బొమ్మిడి నరేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థినిలు పాల్గొని నాట్య మయూరి అవార్డు గెలుచుకున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను అభినందించారు.

# వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కొత్త క్రిమినల్ చట్టాలు

నల్సార్ విసి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త క్రిమినల్ చట్టాలు రావాల్సిన అవసరం ఉందని నల్సార్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు అన్నారు. అందరికీ న్యాయం అందించడం కోసం సమకాలీన, సాంకేతికతలకు అనుగుణంగా పలు అంశాలను పొందుపరిచి జులై 1 నుంచి దేశంలో అమలు కానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై పత్రికా సమాచార కార్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యాన సోమవారం సమావేశం జరిగింది. ఈ వర్క్‌షాప్‌నకు అదనపు డైరెక్టర్ జనరల్ (పిఐబి) శృతి పాటిల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాలు 150 ఏళ్ల నాటి బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో దేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉద్దేశించినవని తెలిపారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ) 1860, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (సిఆర్‌పిసి)1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872ల స్థానంలో ఈమూడు చట్టాలు రానున్నాయని ఆయన తెలిపారు. పత్రికా సమాచార కార్యాలయం(పిఐబి) హైదరాబాద్ ఏర్పాటుచేసిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ రావు మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో భారత ప్రభుత్వం నోటిఫై చేసి 2024 జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలు శిక్ష కంటే న్యాయంపై దృష్టి సారిస్తాయని తెలిపారు. విచారణను వేగవంతం చేయడం ద్వారా, అసమంజసమైన వాయిదాలను అరికట్టడం ద్వారా సత్వర న్యాయం అందేలా చూడటానికి ఉపకరిస్తాయన్నారు. సవరించిన క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరించబడ్డాయని ఆయన వివరించారు. పత్రికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు అందించడంలో దాని పాత్రను వివరించారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త క్రిమినల్ చట్టాలకు కేంద్రం తీసుకువస్తోందన్నారు. మాజీ ఐజీ ఈ.దామోదర్ మాట్లాడుతూ దేశంలో నేర న్యాయవ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన మూడు క్రిమినల్ చట్టాలు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ఉండనున్నాయన్నారు. సీనియర్ ఐపిఎస్, సిడిటిఐ డైరెక్టర్ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల హక్కులపై ఎక్కువ దృష్టి పెట్టడం, న్యాయవ్యవస్థలో మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, కనీస శిక్ష భావన, చిన్న నేరాలకు శిక్షగా సమాజ సేవను ప్రవేశపెట్టడం వంటి ప్రధాన మార్పులను ఆయన వివరించారు.

## 'అవినీతి'గా పరిగణించలేం

(మొదటి పేజీ తరువాయి)

శశాంక జె. శ్రీధర అనే ఓటరు స్థానిక హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన కర్ణాటక హైకోర్టు.. తాము అమలు చేయాలనుకుంటున్న విధానాల గురించి ఏదైనా పార్టీ ప్రకటించడాన్ని ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 కింద అవినీతిగా పరిగణించలేమని పేర్కొంది. వాటిని సంక్షేమ విధానాలుగానే చూడాలని, ఆర్థికపరంగా అవి సరైనవేనా, కాదా అనేది వేరే విషయమని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ శశాంక సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సర్వోన్నత న్యాయస్థానం కూడా ఆయన వాదనను తోసిపుచ్చింది.

## సర్కార్ బియ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేసే వాళ్లు యదేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు.

**మంథని టూ మహారాష్ట్రకు తరలింపు...** మంథని కేంద్రంగా సాగుతున్న రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయల్లా విరాజిల్లుతోంది. మంథనితో పాటు ఇతరప్రాంతాల నుంచి సేకరించిన రేషన్‌బియ్యంను నేరుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో రేషన్ బియ్యానికి డిమాండ్ ఉండటంతో కొందరు వ్యాపారులు ఇక్కడ తక్కువ ధరకు కొని మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా పేదప్రజల నుంచి రూ.10లకు కిలో బియ్యం కొనుగోలు చేసిన వ్యాపారులు మహారాష్ట్రంలో రూ.30ల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. రూపాయి బియ్యం దందా ఈనాడు లక్షలు కురిపిస్తున్నట్లు తెలుస్తోంది.

**చైన్ సిస్టంలో రేషన్ దందా ముఠా...** రేషన్ బియ్యం దందా ఒక చైన్ సిస్టంలో నడుస్తుంది. పల్లెలు, పట్టణాల్లో కొంతమంది తిరుగుతూ రూ.10ల నుంచి 12ల వరకు పేద ప్రజల నుంచి బియ్యం కొనుగోలు చేస్తారు. ఊరూరు తిరిగి సేకరించిన బియ్యంను ఒకచోట నిల్వ చేస్తారు. వీరి నుంచి మరో వ్యాపారి రూ.13నుంచి15లు ఇచ్చి కొనుగోలు చేస్తాడు. ఇలా కొంత మంది నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యంను మరోచోట డంప్ చేస్తారు. డంప్‌చేసిన బియ్యంను పెద్ద వ్యాపారి కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలించి రూ.25నుంచి30లకు కిలోచొప్పున అమ్ముతాడు.ఇలా ఒక్క రూపాయి లాభంపేరుతో లక్షలు సంపాదిస్తున్నారు. ఊరూరు తిరిగే వాళ్లతో పాటు రేషన్ డీలర్లు సైతం వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి పెద్ద వ్యాపారికి అమ్ముతుంటారు.నెల నెలా రేషన్ బియ్యం తీసుకోని వారి సంఖ్యను గుర్తించి రేషన్ డీలర్లు ఏకంగా బస్తాలనే అమ్ముకుంటున్నారు.

**బ్యారేజీలే ప్రధాన రహదారులు...** ఒకప్పుడు మహారాష్ట్రకు బియ్యం తరలించాలంటే వ్యాపారులు ఇబ్బందిపడేవారు. మంథని నుంచి మహారాష్ట్రకు పోవాలంటే మల్హర్, కాటారం, మహదేవ్‌పూర్, కాళేశ్వరం మీదుగా వెళ్లేవారు. అయితే బియ్యం అక్రమరవాణా చేస్తున్న క్రమంలో ఎక్కడ ఎప్పుడు పట్టుబడుతామోననే భయం వ్యాపారుల్లో ఉండేది. కానీ కాళేశ్వరంప్రాజెక్టు పూర్తయిన తర్వాత బ్యారేజీలే వీళ్లకు ప్రధాన రహదారులుగా మారాయి. బియ్యం అక్రమ రవాణాకు సిరిపురం బ్యారేజీ, అన్నారం బ్యారేజీల మీదుగా కాళేశ్వరం, అక్కడ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

**సమాచారం ఉంటేనే తనిఖీలు...** రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ ఉన్నట్లు సమాచారం వస్తేనే అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అనేక ఏండ్లుగా ఈ ప్రాంతంలో అక్రమవ్యాపారం కొనసాగుతుండగా అనేకమార్లు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. అయితే ఈ దందా ఎవరు చేస్తున్నారనే విషయం తెలిసినా వారిపై కఠినంగా వ్యవహరించకపోవడం విడ్డూరమనే చెప్పవచ్చు. కేవలం నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో మళ్లీ సదరు వ్యాపారులు యదేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు.

**నెల వ్యవధిలో 150క్వింటాళ్ల పట్టివేత...** గత నెల రోజుల వ్యవధిలో మంథని పట్టణంలో మూడుసార్లు, మండలంలోని సిరిపురంలో ఒకసారి రేషన్ బియ్యం వాహనాలను పోలీసులు, సివిల్ సప్లై అదికారులు పట్టుకున్నారు.నాలుగుసార్లు అధికారులు పట్టుకున్న వాహనాల్లో సుమారుగా 150క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు సమాచారం అందితేనే నెల వ్యవధిలో 150క్వింటాళ్లు పట్టుకుంటే అధికారులకు తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా ఇంకా ఎన్ని క్వింటాళ్ల బియ్యం రవాణా చేశారో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో వాహనంలో సుమారు 30నుంచి 35క్వింటాళ్ల బియ్యం రవాణా చేస్తూ పట్టుబడ్డాయి. ఇలా ప్రతి నెలా వ్యాన్లు, లారీలు, ఆటో ట్రాలీలు,మినీ వ్యాన్‌లలో రేషన్ బియ్యం తరలిపోతూనే ఉన్నాయి.

## బెయిల్ గడువు పొడిగించండి

(మొదటి పేజీ తరువాయి)

మే 26న(ఆదివారం) సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆరోగ్య సమస్యల వల్ల తాను ఏడు కిలోల బరువు తగ్గానని, కీటోన్ లెవల్స్ చాలా పెరిగిపోవడం వల్ల ఆందోళనకు గురవుతున్నానని ఈ పిటిషన్‌లో కేజ్రీవాల్ ప్రస్తావించారు. అందుకే తాను పిఇటి సిటి స్కాన్ వంటి కొన్ని ముఖ్యమైన వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. అయితే కేజ్రీవాల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఏవిధంగా పరిగణిస్తుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**మే 10న బెయిల్...** లోక్‌సభ ఎన్నికల్లో తన రాజకీయ పార్టీ ఆప్ తరఫున ప్రచారం చేసేందుకు సిఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మే 10న 21 రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో దాదాపు 50 రోజుల కస్టడీ తర్వాత బెయిల్‌తో కేజ్రీవాల్‌కు తాత్కాలిక ఊరట లభించింది. బెయిల్ గడువు జూన్ 1న ముగియనుంది. జూన్ 2న మధ్యాహ్నంలోగా తీహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని గతంలో సుప్రీంకోర్టు ఆయనకు నిర్దేశించింది.

**జైలు నుంచి తప్పించుకునేందుకే కేజ్రీవాల్ డ్రామాలు : బిజెపి**

బెయిల్ గడువును పొడిగించాలంటూ సిఎం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఘాటుగా స్పందించారు. జైలు నుంచి తప్పించుకునేందుకు కేజ్రీవాల్ డ్రామాలు మొదలుపెట్టారని ఆయన విమర్శించారు. 'ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేశాడు. అదంతా జరిగిపోయాక కేజ్రీవాల్‌కు తీవ్ర ఆరోగ్య సమస్యలు మొదలుకావడం విడ్డూరంగా ఉంది. అదే నిజమైతే కేజ్రీవాల్ పంజాబ్ ఎన్నికల ప్రచారాన్ని ఆపేసి వైద్య పరీక్షలు ఎందుకు చేయించుకోవడం లేదు? అని సచ్‌దేవా ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com